

విశాఖ డెయిరీ ఎదుట రైతుల ఆందోళన

ఆవు పాల సేకరణ ధర తగ్గింపుపై ఆగ్రహం

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆవు పాల సేకరణ ధరను తగ్గించడాన్ని నిరసిస్తూ మంగళవారం పాల రైతులు విశాఖ డెయిరీ మెయిన్ గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ, పాడి పశువుల పోషణ ఖర్చులు నానాటికీ పెరిగిపోతుంటే.. డెయిరీ యాజమాన్యం ఆవు పాల ధరను లీటరు రూ.3 చొప్పున తగ్గించడం దారుణమని అన్నారు. దీనివల్ల సుమారు మూడు లక్షల మంది రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం మాట్లాడుతూ, ఆడారి కుటుంబం విశాఖ డెయిరీని తమ సొంత జాగీరులా మార్చుకొని రైతులకు, కార్మికులకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. పాల సేకరణ ధరను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులతో కలిసి డెయిరీ జీఎం ఏవీఆర్ కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.సూర్యనారాయణ, బుద్దరాజు రాంబాబు, ఎం.అప్పలరాజు, నాయనబాబు, బ్రహ్మాజీ, ఎ.లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



విశాఖ డెయిరీ ఎదుట నిరసన తెలుపుతున్న పాల ఉత్పత్తిదారులు

వైసీపీ ప్రభుత్వంలో వేధింపులు, బెదిరింపులు

అందుకే క్వారీలు మూసేసుకోవాల్సి వచ్చింది

- గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఎదుట క్వారీ యజమానుల ఆవేదన
- భయపడొద్దు..అండగా ఉంటామని అమాత్యుని భరోసా
- సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ
- పర్యావరణ అనుమతులు మంజూరుకు కమిటీ ఏర్పాటు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ 'సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, పార్టీ నేత దాడి రత్నాకర్ ఉన్నారు.

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):
గత ప్రభుత్వంలో పాలకులు, వారి వందిమాగధుల వేధింపులు, బెదిరింపులతోక్వారీలు మూసేసుకోవాల్సి వచ్చిందని, దాంతో కొంతమంది అప్పుల పాలవ్వడం జరిగిందని క్వారీ యజమానులు ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం జడ్పీ హాలులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన క్వారీ, క్రషర్స్, గ్రానైట్ క్వారీ యజమానులు, అధికారులతో గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులను నిర్భయంగా చెప్పాలని సూచించినప్పుడు పలువురు క్వారీ యజమానులు అనుభవాలను ఏకరువు పెట్టారు. అనకాపల్లి ప్రాంతంలో క్వారీలు నిర్వహించే వెంగమాంబ శ్రీనివాస్ మాట్లాడుతూ తనిఖీల పేరిట విపరీతంగా వేధింపులకు పాల్పడడమే కాకుండా బెదిరించారని ఫిర్యాదు చేశారు. కొందరు అధికారులు బరితెగించి ప్రవర్తించడంతో వ్యాపారం నిలిపివేశానన్నారు. ఇంకా ఈసీ అనుమతుల విషయంలో ఇబ్బందులున్నాయని చెప్పడంతో మంత్రి స్పందిస్తూ త్వరలో సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనకాపల్లికి చెందిన మరో క్వారీ యజమాని నరసింహరాజు మాట్లాడుతూ లీజుల మంజూరులో పలు ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. కుంచంగి గ్రామానికి చెందిన క్వారీ ఓనర్ జగ్గారావు మాట్లాడుతూ క్వారీకి సంబంధించి ఈసీ అనుమతి అనేది ప్రహసనంగా మారిందన్నారు. పరవాడ మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాధంశెట్టి నీలబాబు మాట్లాడుతూ రాజకీయంగా వేధించారని, జీవీఎంసీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలని బెదిరించారన్నారు. వినకపోవడంతో క్వారీని నిలుపుదల చేశారన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన నాగరాజు మాట్లాడుతూ భీమిలి మండలం దాకమర్రిలో కొంతమందితో కలిసి నిర్వహిస్తున్న క్వారీని తనిఖీ చేసి రూ.ఎనిమిది కోట్లు జరిమానా విధించారన్నారు. తామంతా టీడీపీ సానుభూతిపరులం కావడంతో వేధించారని వాపోయారు. క్వారీ యజమానుల సమస్యలు విన్న మంత్రి బదులిస్తూ గత పాలకులు గనుల శాఖను సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. క్వారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంఎఫ్ (డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్) సెస్‌ను స్థానికంగా ప్రభావితమైన గ్రామాల అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. క్వారీల లీజుల కోసం పర్యావరణ అనుమతులు మంజూరుకు ఒక కమిటీని ఏర్పాటుచేస్తామని ... మిగతా 10వ పేజీలో

గంజాయిపై ఉక్కుపాదం

నిఘా, తనిఖీలు తీవ్రతరం చేసిన పోలీసు, ఎక్సైజ్ శాఖలు

- అల్లూరి జిల్లా సరిహద్దు మండలాల్లో మరిన్ని చెక్‌పోస్టులు
- ఈ ఏడాది ఇంతవరకు 5,519 కిలోల గంజాయి స్వాధీనం
- 388 మందిపై కేసులు, 108 మంది అరెస్టు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీ నుంచి అనకాపల్లి జిల్లా మీదుగా గంజాయి రవాణాను పూర్తిగా కట్టడి చేసేందుకు పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. యువతను పెడదారి పట్టించే గంజాయి సాగు, రవాణాను సమూలంగా అరికట్టాలన్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆదేశాల మేరకు పోలీసు, ఎక్సైజ్ శాఖలు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి గంజాయి రవాణాపై నిఘాను పెంచాయి. ఇప్పటికే వున్న చెక్ పోస్టులతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాకు సరిహద్దులో వున్న అనకాపల్లి జిల్లాలోని పలు మండలాల్లో కొత్తగా చెక్‌పోస్టులను ఏర్పాటుచేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 5,519 కిలోల గంజాయిని పట్టుకుని 388 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 108 మందిని పోలీసులు అరెస్టు చేశారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుకున్న నిందితులతో ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీసు అధికారులు



అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దులోని దేవరాపల్లి మండలం పినకోట రోడ్డులో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు

428 కిలోల గంజాయి పట్టివేత

- రెండు లీటర్ల లిక్విడ్ గంజాయి కూడా..
- ఏడుగురి అరెస్టు
- ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడి

· 10లో

గత వైసీపీ ప్రభుత్వం గంజాయి సాగు, రవాణాను అరికట్టడానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోగా, గంజాయి స్మగ్లర్లను పరోక్షంగా ప్రోత్సహించే విధంగా వ్యవహరించింది. దీంతో గంజాయి స్మగ్లర్లు ఐదేళ్లపాటు అనకాపల్లి జిల్లాను రవాణాకు అడ్డాగా (ట్రాన్సిట్ హబ్) మార్చుకున్నారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో సాగయ్యే గంజాయిని కొనుగోలు చేసి, వివిధ మార్గాల్లో అనకాపల్లి జిల్లాలో ఎంపిక చేసుకున్న రహస్య కేంద్రాలకు చేర్చేవారు. ఇక్కడి నుంచి రాష్ట్రం, దేశంలోని పలు ప్రాంతాలకు రవాణా చేసేవారు. దీంతో ఎక్కడ గంజాయి పట్టుబడినా- వాటి మూలాలు ఏవోబీతోపాటు అనకాపల్లి జిల్లాలో కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. యువతను పెడదారి పట్టించే గంజాయిని సమూలంగా అరికట్టాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీంతో పోలీసు, ఎక్సైజ్ శాఖలు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆనుకుని అనకాపల్లి జిల్లాలో నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల ... మిగతా 10వ పేజీలో

వైసీపీ పాలనలో కార్మిక శాఖ నిర్వీర్యం



ఈఎస్‌ఐ ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమంలో కార్మిక మంత్రి సుభాశ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, కలెక్టర్ విజయకృష్ణన్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, తదితరులు

- కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు
- కేంద్రం ఇచ్చిన ఈఎస్‌ఐ ఆస్పత్రిని నిర్మించలేదు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ ధ్వజం
- అచ్యుతాపురం ఎస్‌ఈజడ్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రికి ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన

అచ్యుతాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):
కార్మిక శాఖను వైసీపీ పాలకులు ఐదేళ్లపాటు నిర్వీర్యం చేశారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ ఆరోపించారు. అచ్యుతాపురం ఎస్‌ఈజడ్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాశ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది కార్మికుల సంక్షేమాన్ని గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ఇక్కడ ఈఎస్‌ఐ ఆస్పత్రిని కేంద్ర ప్రభుత్వం గతంలోనే మంజూరు చేసిందని, కానీ జగన్ ప్రభుత్వం నిర్మాణ పనులు



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ఆవిష్కరించిన శంకుస్థాపన ఫలకం

చేపట్టలేదని అన్నారు. అచ్యుతాపురం సెజ్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని కర్మాగారాల్లో గత ఐదేళ్ల కాలంలో పలు ప్రమాదాలు జరిగి పలువురు కార్మికులు మృతిచెందడం లేదా తీవ్రంగా గాయపడడం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో ఇక్కడ ఈఎస్‌ఐ ఆస్పత్రిని నిర్మించి వుంటే.. చనిపోయిన వారిలో కొంతమంది కార్మికుల ప్రాణాలను అయినా కాపాడగలిగే వారని అన్నారు.

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తున్నదని, ఐదేళ్ల వైసీపీ పానలతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని గాడినపెట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రంగా కృషి చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా వుంటూ, రాష్ట్రానికి పెద్ద మొత్తంలో నిధులు తీసుకువస్తున్నారని ... మిగతా 10వ పేజీలో

గ్యాస్ ఏజెన్సీలకు క్యూ

ఉచిత సిలిండర్లకు ఈ-కేవైసీ కోసం లబ్ధిదారులు పరుగులు

- రేషన్, ఆధార్, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు అనుసంధానం
- గ్యాస్ ఏజెన్సీల వద్ద పెరిగిన రద్దీ



ఈ-కేవైసీ కోసం చోడవరంలోని ఒక గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

చోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):
కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీల్లో ఒకటైన ఏటా మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీకి రంగం సిద్ధం కావడంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద సందడి పెరిగింది. ఉచిత సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి అమలు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతోపాటు, గ్యాస్ కంపెనీలకు చెల్లించేందుకు అవసరమైన నిధులను కూడా ఇప్పటికే విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ పథకానికి అర్హులైన లబ్ధిదారులు వంట గ్యాస్ ఏజెన్సీ లేదా డీలర్ వద్దకు వెళ్లి ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ ఫోన్, బ్యాంకు ఖాతాల నంబర్లను వంట గ్యాస్ కనెక్షన్ నంబరుతో అనుసంధానం చేయడానికి ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో లబ్ధిదారులు ఆయా గ్యాస్ ఏజెన్సీలకు వెళుతుండడంతో రద్దీగా మారింది. ఉచిత సిలిండర్లకు అర్హులైన లబ్ధిదారులు తప్పనిసరిగా ఫోన్ నంబర్‌తోనే గ్యాస్ బుక్ చేయవలసి వుంటుంది. సిలిండర్ బుక్ చేసినప్పుడే ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాలి. సిలిండర్ డెలివరీ అయిన తరువాత అదే ఫోన్ నంబర్‌కు ఒక మెసేజ్ వస్తుంది. ఇది వచ్చిన రెండు రోజుల వ్యవధిలో లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ అవుతాయి.

ఇదిలావుండగా గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది వినియోగదారులు ఎవరి పేరుమీదో వంట గ్యాస్ కనెక్షన్లు తీసుకుని సిలిండర్లను వినియోగించుకుంటున్నారు. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సైతం, సిలిండర్ రీఫిల్‌కు గ్యాస్ బుక్ తీసుకుని వాటిపైనే వివరాలు రాసి సిలిండర్లు డెలివరీ చేస్తున్నారు. ఇదే కాకుండా గ్యాస్ కనెక్షన్ ఉన్న చాలామంది వినియోగదారులకు కనెక్షన్ తీసుకునే సమయంలో సెల్‌ఫోన్లు లేకపోవడంతో తమకు తెలిసిన వారి మొబైల్ నంబరును నమోదు చేయించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సబ్సిడీ ఇస్తామన్నప్పుడు చాలా మంది తమ గ్యాస్ కనెక్షన్లకు బ్యాంకు ఖాతా, సెల్‌ఫోన్ నంబర్లతో అనుసంధానం చేయించుకున్నారు. కొంతకాలం తరువాత కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని దాదాపు తీసివేయడంతో చాలామంది తమ వంట గ్యాస్ కనెక్షన్లు అప్‌డేట్ చేసుకోలేదు. దీంతో గ్రామాల్లో ఒక్కో మొబైల్ నంబరుపై రెండు, మూడు గ్యాస్ కనెక్షన్లు వుండిపోయాయి.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత వంట గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఆధార్ కార్డుతో అనుసంధానమైన మొబైల్ నం బరు, రేషన్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా నంబరును గ్యాస్ ఏజెన్సీలో ఈ-కేవైసీ చేయిం చుకోవడానికి వినియోగదారులు ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్దకు వస్తున్నారు. దీంతో గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల వద్ద రద్దీ పెరిగింది.

గంధవరంలో చిరుతపులి?

- కల్లాల వద్ద అర్ధరాత్రి సంచారం
- భయాందోళనలో రైతులు

చోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):
మండలంలోని గంధవరంలో పులి సంచారం కలకలం రేపింది. సోమవారం రాత్రి గ్రామంలోని రైతుల కల్లాల వద్ద ఉన్న కుక్క పెద్దగా అరుస్తుండడంతో సమీపంలో వున్న రైతులు పాక వద్దకు వెళ్లారు. చిరుతపులి, కుక్కను నోటకరుచుకుని పారిపోతూ కనిపించింది. దీంతో కల్లాల సమీపంలోని రైతులు భయాందోళన చెందారు. ఏడాది క్రితం గంధవరంలో పులి సంచరించి, పలు పశువులను చంపివేసిన విషయం తెలిసిందే. దీనిని బంధించేందుకు అప్పట్లో అటవీ శాఖ అధికారులు బోను ఏర్పాటు చేసినప్పటికీ అది పట్టుబడలేదు. మళ్లీ ఇప్పుడు చిరుతపులి కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఓటరు జాబితాల సవరణ

జనవరి ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండే వారంతా ఓటర్లుగా అర్హులు

- వచ్చే నెల 28వ తేదీ వరకు దరఖాస్తు
- 9, 10, 23 24 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో బీఎల్‌వోలు
- డీఆర్‌ఓ దయానిధి వెల్లడి

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):
భారత్ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 షెడ్యూల్‌ను విడుదల చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఈ మేరకు రాజకీయ పార్టీల కార్యకర్తలు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఏడాది అక్టోబరు ఒకటో తేదీనాటికి 18 సంవత్సరాలు నిండే వారు కూడా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 29వ నుంచి నవంబరు 28వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు. నవంబరు 9 (శనివారం), 10 (ఆదివారం), 23(శనివారం) 24(ఆదివారం) తేదీలను ప్రత్యేక ప్రచార రోజులుగా ప్రకటించామని, ఆయా రోజుల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఫారం-6 కొత్తగా పేరు నమోదు, ఫారం-7 ఓటరు జాబితాలో పేర్లు తొలగింపు, అభ్యంతరాలకు, ఫారం-8 మార్పులకు వినియోగించుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు సమర్పించవచ్చునని లేదంటే ఆన్‌లైన్‌లో 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఓటర్స్.ఈసీఐ.జీఓవి.ఐఎన్' పోర్టల్‌లో లాగిన్ అయి ఫారాలను అప్‌లోడ్ చేయవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ నాయుడు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి కెహరినాథబాబు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బొలిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ దయానిధి

కౌన్సిల్ సమావేశాలు టీ, సమోసాల కోసమేనా?

- మండిపడిన కొత్తపాలెం కౌన్సిలర్ సంతోష్
- సచివాలయాల సిబ్బంది కార్యాలయాల్లో ఉండడం లేదని పలువురు సభ్యుల అసంతృప్తి
- ప్రజారోగ్య శాఖ తీరు బాగాలేదు : చైర్‌పర్సన్
- మునిసిపాలిటీలో కోతుల పట్టివేతకు తీర్మానం



మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మీరిచ్చే టీ, సమోసాలు తీనేసి వెళ్లిపోవడానికేనా మునిసిపల్ సమావేశాలు పెడుతున్నారా అని కొత్తపాలెం కౌన్సిలర్ రాపేటి సంతోష్ ప్రశ్నించారు. వార్డుల్లో కనీసం అభివృద్ధి చేయడానికి లేదా అని ఆయన నిలదీశారు. మంగళవారం చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన అత్యవసర, సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు కౌన్సిల్ మేడపై ఎప్పటిలాగానే షాడో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించి నిర్దేశించిన సమయం కన్నా అర్ధగంట ఆలస్యంగా ప్రారంభించారు. సమావేశంలో చైర్‌పర్సన్ రమాకుమారి అజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చ ప్రారంభించారు. ఈ సమయంలో కొత్తపాలెం కౌన్సిలర్ రాపేటి సంతోష్ మాట్లాడుతూ అజెండా రూపకల్పనలో కౌన్సిలర్ల ప్రమేయం లేకుంటే తామెందుకని ప్రశ్నించారు. వార్డును అభివృద్ధి పరుస్తానని ప్రజలు నన్ను కౌన్సిలర్‌గా ఎన్నకున్నారని, కానీ వార్డులో మునిసిపల్ నిధులతో అభివృద్ధి జరగలేదన్నారు. విశాఖ డెయిరీ, గత ఎమ్మెల్యే నిధులతో కొన్ని పనులు చేయించుకున్నామే కానీ మునిసిపల్ పరంగా అంతగా జరగలేదన్నారు. వార్డులోని స్కూలు వద్ద, తాగునీటి ట్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్తను, పూడుకుపోయిన కాలువ ఫొటోలను కౌన్సిల్ ముందు ఉంచారు. అనంతరం 24వ వార్డు కౌన్సిలర్ సుంకర మరిణేశ్వరరావు(వైసీపీ), 13వ వార్డు కౌన్సిలర్ అర్రెపు నాగ త్రినాథ ఈశ్వర గుప్తా(వైసీపీ) తదితరులు మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది కార్యాలయాల్లో ఉండడం లేదని, అడిగితే ఫీల్డ్‌లో ఉన్నామంటూ సమాధానం ఇస్తున్నారన్నారు. సచివాలయాల పనితీరు అధ్వానంగా ఉందని అనడంతో పలువురు కౌన్సిలర్లు ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని ఆరోపించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ మునిసిపాలిటీకి రూ.74 లక్షలు మంజూరయ్యాయని, వీటిని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. పట్టణంలో కోతులను పట్టివేసి అటవీప్రాంతాలకు తరలించేందుకు తీర్మానం చేశారు. మునిసిపాలిటీలో ప్రజారోగ్య శాఖ పనితీరు బాగాలేదన్నారు.



సమస్యలపై నిలదీస్తున్న కొత్తపాలెం కౌన్సిలర్ సంతోష్

అనంతరం మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధులు మునిసిపాలిటీకి రాలేదని, మునిసిపాలిటీలో గతంలో జరిగిన వివిధ కారణాల కారణంగా ఈ నిధులు నిలిచిపోయాయన్నారు. గతంలో ఇంటింటా జరిగిన సర్వేలో మునిసిపాలిటీలో 484 ఇళ్లకు ఇంటి పన్నులు లేవని గుర్తించామన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, కౌన్సిలర్లు మజ్జి రామకృష్ణ, దూది నరసింహామూర్తి, అచ్యుతరావు, బీబీ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

- ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం హరిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి త్రోబాల్ సెలక్షన్ ట్రైల్స్ అండర్-14,-17 బాలబాలికల పోటీలు, ఎంపికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చునన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 450 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీపాద రవి, నాయకులు బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాహుజీ, డ్రీమ్స్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్య పరికరాలు పంపిణీ

అచ్యుతాపురం అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొప్పెర్లలో రైతులకు బిందు సేద్య పరికరాల పంపిణీని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బిందుసేద్యం కోసం ఐదు ఎకరాల కంటే తక్కువ ఉన్న భూమి గల రైతులకు 90 శాతం, అంతకన్నా ఎక్కువ భూమి ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలు ఇస్తారన్నారు. అలాగే తుంపర్ల సేద్య పరికరాలు ఐదెకరాల భూమి ఉన్న రైతుకు 55 శాతం, అంతకన్నా ఎక్కువ భూమి గల రైతులకు 45 శాతం రాయితీపై పరికరాలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ జీవీ లక్ష్మి, ఎంఐఈ విద్యాసాగర్, పల్లి శేషగిరిరావు, కొల్లి వరహాలరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన

అచ్యుతాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులకు చోడపల్లిలో ప్రతి రోజూ ఉచిత అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులెవరైనా ప్రతీ రోజు మధ్యాహ్నం ఇక్కడకు వచ్చి భోజనం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు.

గణేష్‌కు యంగ్ ఇండియన్ సేవా పురస్కారం



అవార్డును అందుకుంటున్న గణేష్

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టి. సిరసపల్లి గ్రామానికి చెందిన నిరంతర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొమ్మోజు గణేష్ యంగ్ ఇండియన్ జాతీయ స్థాయి సేవా పురస్కారాన్ని మంగళవారం హైదరాబాద్‌లో ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర సేవా ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలు, మెగా వైద్యశిబిరాలు, వృద్ధాశ్రమాల్లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు తదితర అంశాలను గుర్తించి ఈ అవార్డును అందించడం ఆనందదాయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోండి

ఎస్.రాయవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ వాసంతి తెలిపారు. వరల్డ్ స్ట్రోక్ డే పురస్కరించుకొని సర్వసిద్ధి పీహెచ్‌సీ వద్ద మంగళవారం బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్‌ల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ ఉప్పు వినియోగించడంతోపాటు మసాలతో కూడిన ఆహారం, నిల్వ పచ్చళ్లు వాడడం, మానసిక ఒత్తిడికి లోనుకావడం వలన బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ బారిన పడే అవకాశం ఉందన్నారు. మంచి ఆహారంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరుచుకున్నట్టయితే ఆరోగ్యవంతమైన జీవితం గడపొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది టి నాగేశ్వరరావు, ఎం. రత్నసఖి, పీఎస్‌వీఎస్ ప్రసాద్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ



కైలాసపట్నంలో బాణసంచాను పరిశీలిస్తున్న తహసీల్దార్ తిరుమలబాబు

కోటవురట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమతులు పొందిన బాణసంచా తయారీ కేంద్రాలను తహసీల్దార్ తిరుమలబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యండపల్లి, కైలాసపట్నం గ్రామాల్లో అనుమతులు పొందిన బాణసంచాను తయారు చేస్తున్న కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు ఇచ్చి లైసెన్స్‌లను పరిశీలించి, అనుమతులకు మించి నిల్వలు ఏమైనా ఉన్నాయి లేదా తనిఖీ నిర్వహించారు. ఏ సమయంలోనైనా ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. అనధికారికంగా నిల్వలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలుతీసుకోవాలని సూచించారు.

ఉపాధి హామీలో అక్రమాలపై వాగ్వాదం

- అధికారులను నిలదీసిన రామచంద్రపురం జనసేన నేతలు
- విచారణకు ఆదేశించిన డ్వామా పీడీ పూర్ణిమాదేవి
- నీలిగుంటలో మస్తర్లపై ప్రజావేదికలో గందరగోళం
- హాజరుకాని పలువురు ప్రజాప్రతినిధులు



రామచంద్రపురంలో అక్రమాలపై అధికారులతో జనసేన నేతల వాగ్వాదం

కోటవురట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం తనిఖీ ప్రజావేదిక మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జరిగింది. సమావేశం ప్రారంభంలో ఉపాధి హామీ పనుల వివరాలను అధికారులు తెలియజేస్తుండగా రామచంద్రపురంలో ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని జనసేన పార్టీ నాయకుడు బత్తుల బాలనాయుడు డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఎస్ఆర్‌పీకి బాలనాయుడు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సభలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని చక్కదిద్దారు. దీనిపై స్పందించిన డ్వామా పీడీ పూర్ణిమాదేవి మాట్లాడుతూ రామచంద్రపురంలో జరిగిన అక్రమాలపై ఎంపీడీవో కాశీవిశ్వనాథం విచారణ చేస్తారని ప్రకటించారు. నీలిగుంటలో ఉపాధి హామీ పనుల మస్తర్లు బయట వ్యక్తులకు వేయడంపై గ్రామానికి చెందిన కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో వీఆర్‌పీ కుటుంబీకులు వారితో వాగ్వాదానికి దిగడంతో గందరగోళానికి దారితీసింది. ఒక దశలో ఇరువర్గాల వాగ్వాదం పెరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఎస్ఐ రమేశ్ జోక్యం చేసుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో వివాదం సద్దుమణిగింది. బీకేపల్లితోపాటు పలుగ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల పేరుతో షాపులు కట్టుకున్నారని డీఆర్‌పీలు నివేదికలో వెల్లడించారు. అటువంటి వారితో ఉపాధి హామీ నిధులను రికవరీ చేయాలని పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు వైస్‌ఎంపీపీలు సీతాబాబు, చెక్కాసుజాత, జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు డుమ్మా కొట్టారు. ఈ సమావేశంలో అడిషనల్ పీడీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసరు దివ్య, స్టేట్ రిసోర్స్‌పర్సన్స్‌లు రాజేంద్ర, నాగరాజు, ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఎంపీవో నాగరాజు, టీడీపీజిల్లాకార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు జానకిశ్రీనివాసరావు, పి. సూర్యారావు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న సీహెచ్‌వీకే.నరసింహారావు దంపతులు

పాయకరావుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక శ్రీప్రకాష్ ఆయుర్వేద చికిత్సాలయంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీప్రకాష్ ఆయుష్ అండ్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సీహెచ్‌వీకే.నరసింహారావు, రామసీత దంపతులు ధన్వంతరి హోమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య రంగంలో విశిష్ఠ సేవలందించిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, సునేత్రి ఆయుర్వేదాశ్రమం, పరిశోధన కేంద్రం(కేరళ) డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రసాద్, జటాస్ ఆయుర్వేదిక్ హెల్త్ కేర్ సిస్టమ్స్(కాకినాడ) మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ జలావల్లభుల ఎల్ఎస్.శాస్త్రిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు డాక్టర్ ఎం.ప్రసాద్ మాట్లాడుతూ ఆయుర్వేదం మన పూర్వీకులు ఇచ్చిన గొప్ప సంపద అని, ఆయుర్వేదం మనిషి ఆరోగ్యకరమైన జీవన విధానానికి దారిని చూపే ఒక దిక్సూచి అన్నారు. డాక్టర్ జటావల్లభుల ఎల్ఎస్.శాస్త్రి మాట్లాడుతూ ఆయుర్వేదంతో మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. కోవిడ్ తరువాత భారత వైద్య విధానంపట్ల ప్రపంచ దేశాలకు ఆసక్తి కలిగిందన్నారు. ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సీహెచ్‌వీకే.నరసింహారావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన ఆయుర్వేద వైద్యాన్ని ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో శ్రీప్రకాష్ ఆవరణలో ఆయుర్వేద చికిత్సాలయాన్ని స్థాపించి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, సమీరా దంపతులు, శ్రీప్రకాష్ ఆయుష్ చారటబుల్, రీసెర్చ్ ట్రస్ట్ అడ్వైజర్ డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆయుర్వేద చికిత్సాలయం ప్రధాన వైద్యులు డాక్టర్ టి.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీఎస్ బినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ధన్వంతరీకి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బినయ్‌కుమార్ మాట్లాడుతూ ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని ఆయుర్వేద వైద్యం పిల్లల నుంచి పెద్దల వరకూ ఎంతో మంచిదన్నారు. ప్రభుత్వం ఆయుర్వేద ఆస్పత్రుల్లో దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులను అందుబాటులో వుంచిందన్నారు. ఈ సేవలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది నరసమ్మ, యోగా టీచర్లు దవర సింగి రాంబాబు, డీఎస్‌వీ సాయి పాల్గొన్నారు.

ఇసుక వేలం పాటలు నిర్వహిస్తే చర్యలు

- తహసీల్దార్ తిరుమలబాబు



ఉచిత ఇసుక ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న తహసీల్దార్

కోటవురట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉచిత ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ తిరుమలబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక రవాణా విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని, జీపీఎస్ అనుసంధానమైన, అనుమతులు ఇచ్చినా వాహనాలు మాత్రమే ఇసుక రవాణాచేయాలని సూచించారు. ఉచిత ఇసుక కేవలం అభివృద్ధి పనులు, వంతెనలు, కల్వర్టు, డ్రైనేజీలు, సొంతింటి నిర్మాణానికి సిమెంట్ రోడ్లు, ఇరిగేషన్లు పనులకు వినియోగించుకోవచ్చునన్నారు. వంతెనలకు 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలు జరిపాలన్నారు. అలాగే బోరు బావులు దూరంగా తవ్వకాలు చేయాలన్నారు. సర్పా, వరాహా నదులు పక్కనే ఉన్న గ్రామాల్లో అనధికారికంగా ఇసుక తవ్వకాలకు వేలం పాట నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బీకేపల్లిలో భూ రీ సర్వేకు 144 దరఖాస్తులు

కోటవురట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీకేపల్లి గ్రామంలో భూ రీ సర్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం 144 ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. మంగళవారం బీకేపల్లి సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు 15 రోజులులోగా పరిష్కరిస్తామన్నారు. గతంలో రీసర్వే చేసినప్పుడు భూమి విస్తీర్ణంలో తప్పులు, హెచ్చుతగ్గులు, భూయాజమాని పేరు మార్పులు పరిష్కారిస్తామన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీటీ రమేష్, సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్ పెట్ల లింగంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎలమంచిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నూతన 33 కేవీ లైన్ వేసేందుకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ధర్మవరం, కాకివానివీధి, రామచంద్రమ్మ కాలనీ, కల్కి పెట్రోల్ బంకు ప్రాంతం, పెంజెరువు ప్రాంతం, తులసీనగర్, ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలనీ, అగ్నిమాపక కాలనీ, సోమలింగపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్కిల్ సెన్సెస్ ఎన్యూమరేటర్లకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు

ఎలమంచిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా స్థాయి స్కిల్ సెన్సెస్ ఎన్యూమరేటర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ ఎన్. గోవిందరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల ఆదేశాలతో రాష్ట్రంలో 15 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారి విద్యా అర్హతలు, ఉద్యోగ అనుభవం అనుసరించి శిక్షణ ఇస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని జనవాసాలను క్లస్టర్‌గా విభజించి, ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించి సర్వే చేస్తామన్నారు. ప్రతి ఎన్యూమరేటరుకు నిర్దిష్ట కుటుంబాలు మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల, డీఈవో శాంతి, ట్రైనర్ సంతోష్, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై తేనెటీగలు దాడి



జూనియర్ కళాశాల రోడ్డులో తేనేటీగలు దాడితో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ఎలమంచిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం తేనెటీగలు దాడి చేయడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో కళాశాల విద్యార్థులుబయటకు రావడంతో తేనెటీగలు వారిపై దాడి చేశాయి. దీంతో విద్యార్థులు పరుగులు తీశారు. ఈ రోడ్డులో సబ్ రిజస్ట్రార్ కార్యాలయం ఉండడంతో క్రయ, విక్రయదారులు తేనెటీగల దాడిలో గాయపడ్డారు. వీరంతా సమీపంలోని ఆస్పత్రులకు తరలివెళ్లి వైద్యం చేయించుకున్నారు.

మునగ ఆకుతో రక్తహీనత నివారణ



మునగాకు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి వీవర్స్ కాలనీ, కొత్తపేట, శెట్టిబలిజపేటలో వున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం మునగ ఆకు వల్ల కలిగే ప్రయోజనాలపై పిల్లలకు, బాలింతలు, గర్భిణులకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులు అవగాహన కల్పించారు. మునగ ఆకు వాడడం వల్ల రక్తహీనత నివారించవచ్చునని అంగన్‌వాడీ కార్యకర్తల అసోసియేషన్ జిల్లా ప్రతినిధి దుర్గారాణి చెప్పారు. మునగాకు, తెలగపిండితో చేసిన వంటకాలను ఈ కేంద్రాల్లో ప్రదర్శించారు. కార్యక్రమంలలో సూపర్‌వైజర్ లలిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేరమ్స్, బేస్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఎస్.రాయవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ, ఎస్.రాయవరం జడ్పీ హైస్కూళ్లకు చెందిన జంప తేజ, గుజ్జేటి వాహిని కేరమ్స్, బేస్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు కందూరు రాజు, శ్రీను మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కేరమ్స్ పోటీల్లో అండర్-14 విభాగంలో గుడివాడ హైస్కూల్‌కు చెందిన జంప తేజ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. అలాగే అండర్-17 బేస్ బాల్ పోటీలో ఎస్.రాయవరం హైస్కూల్‌కు చెందిన గుజ్జేటి వాహిని చక్కని ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. విద్యార్థినులు, పీడీలను ప్రధానోపాధ్యాయులు ఎం.నాగన్నదొర, ఎంఎస్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

అభిజిత్‌ను పునః ప్రారంభించాలని కార్మిక శాఖ మంత్రికి వినతి



కార్మిక శాఖ మంత్రి సుభాష్‌కి వినతిపత్రాన్నిస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లోని అభిజిత్ కర్మాగారాన్ని పునఃప్రారంభించాలని కోరుతూ కార్మిక శాఖ మంత్రి సుభాష్‌కు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈఎస్ఐ ఆస్పత్రి శంకుస్థాపనకు వచ్చిన మంత్రి సుభాష్‌ని వీరు కలిసి, అభిజిత్ యాజమాన్యం తీరును వివరించారు. కంపెనీ లేఆఫ్ ప్రకటించటం వల్ల వెయ్యి మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. 15 రోజుల నుంచి కర్మాగారం ఎదుట ఆందోళన చేస్తున్నా యాజమాన్యానికి చీమ కుట్టినట్టయినా లేదన్నారు. కర్మాగారాన్ని పునః ప్రారంభించి కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని వారు మంత్రిని కోరారు. సమస్య త్వరలో పరిష్కరించడానికి కృషిచేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు.

గొరపూడి, వెంకటాపురంల్లో పొలం పిలుస్తోంది



నామవరంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న ఏవో

రాంబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపూడి, వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారిణి సి.సుమంత వరి పంటలో యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, కౌలు రైతులకు రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కోటేశ్వరరావు, వీఏఏ రామారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కనకరత్నం, హైమవతి, రైతులు పాల్గొన్నారు.

నామవరంలో..

పాయకరావుపేట రూరల్: మండలంలోని నామవరంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఆదినారాయణ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో సస్యరక్షణ చర్యలు, ప్రకృతి వ్యవసాయం, ఎరువుల యాజమాన్యం గురించి ఆయన రైతులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రావణ్, శృతి, రమ్య పాల్గొన్నారు.

చెత్త తరలింపుపై నిర్లక్ష్యం

ఎక్కడక్కడ చెత్తను కాల్చిన పంచాయతీ అధికారి



ధర్మవరం అగ్రహారంలో చెత్తను కాల్చుతున్న దృశ్యం

ఎస్.రాయవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో పేరుకుపోయిన చెత్తను దూరం ప్రాంతానికి తరలించకుండా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామంలో పలు చోట్ల రోడ్డు పక్కన ఉన్న చెత్తను అక్కడే కాల్చుతున్నారు. మంగళవారం పలుచోట్ల ఉన్న చెత్త కాల్చడంతో దాని నుంచి వెలువడిన పొగకు ఆ మార్గంలో రాకపోకలు చేసేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెత్తను కాల్చకుండా దూర ప్రాంతాలకు తరలించాలని పలువురు కోరుతున్నారు.

కారు బైక్ ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టుకు తీవ్ర గాయాలు కావడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మునగపాక మండలం ఒంపోలు గ్రామానికి చెందిన సురేష్‌కు గాయాలైనట్టు తెలిసింది. ఎలమంచిలి నుంచి ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తుని నుంచి అనకాపల్లి వైపు ప్రయాణిస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న రీ సర్వే తహసీల్దార్ చిన్నికృష్ణ

అర్జీదారుల సమక్షంలోనే సమస్యల పరిష్కారం

సబ్బవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమక్షంలోనే భూ సమస్యలు పరిష్కరిస్తామని రీ సర్వే తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని అద్దూరు సిరసపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరసపల్లిలో ఎక్కువ మంది డి.పట్టాలు కలిగి ఉన్నామని, రీ సర్వేలో ఎల్‌పీ నంబర్లు ఇవ్వలేదని అర్జీలు ఇచ్చారని, పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు. గ్రామ కంఠం సమస్య ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉందని గ్రామస్థుల అర్జీ మేరకు న్యాయం చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సులు పూర్తయిన 15 రోజుల్లో అర్జీలన్నీ పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వై.గణేష్, సర్వేయర్లు ఎల్.అప్పారావు, శ్రీనివాసరావు, సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ పెద్ద దాడి కన్నంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

» ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమణ



సమావేశంలో పోస్టర్లను విడుదల చేస్తున్న రమణ, నాయకులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లాలో వేల సంఖ్యలో విద్యార్థులు ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్నారన్నారు. విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం పడుతుందన్నారు. ఒక పక్క సెమిస్టర్ పరీక్షలు వస్తున్న సందర్భంలో కాలేజీ ఫీజు కట్టకపోతే సెమిస్టర్ పరీక్ష ఫీజు కట్టించుకోమని కళాశాల యాజమాన్యాలు చెప్పడం విద్యార్థులు, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.అర్జున్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

» యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ డిమాండ్



సమస్యలపై ధర్నా చేస్తున్న ప్రభుత్వ ఆస్పత్రుల కార్మికులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పూడోట ప్రకాశ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ ఆవరణలో మంగళవారం సంఘ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల మాదిరిగా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సంఘ విశాఖ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులపై అధికారులు చిన్నచూపు చూడడం సరికాదన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ పే స్లిప్‌లు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు సత్యవతి, కిరణ్, వరప్రసాద్, అప్పలరాజు, రాజ్యలక్ష్మి, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ అంబేద్కర్

పరవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించడం కోసమే ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలను నిర్వహిస్తున్నదని తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్ చెప్పారు. మండలంలోని భరణికం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యనైనా సభ దృష్టికి తీసుకువస్తే 15 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. సమస్యలకు సంబంధించిన అర్జీలను గ్రామసభలో అందజేయాలన్నారు. ఈ గ్రామసభలో 134 మంది అర్జీలు అందజేశారు. భరణికం రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను కాపాడాలని చిప్పాడ రామారావు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదిశెట్టి పూజ, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌నాయుడు, ఇన్‌చార్జి ఆర్‌ఐ సురేష్, వీఆర్వో బి.శ్రీనివాసరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని వినతి



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలోని మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ నాయకులు మోసా రామకృష్ణ, బండారు రామునాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం విశాఖపట్నంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ కాలుష్యం కారణంగా మత్స్యకారుల జీవనోపాధి అగమ్యగోచరంగా తయారైందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది మత్స్యకారులు వలస వెళ్లిపోతున్నారని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు కల్పనా రాజశేఖర్, వెన్నెల నూకరాజు, రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

80వ వార్డులో సమస్యల రాజ్యం

పట్టణంలోని 80వ వార్డు ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. వార్డు పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ, కర్రి వారివీధి, గౌరీ కాలనీల వాసులు పడరాని పాట్లు పడుతున్నారు. అక్కరకురాని సులభ్ కాంప్లెక్స్... నిరుపయోగమైన వాటర్ ట్యాంకు... ఎక్కడికక్కడే చెత్తాచెదారం.. భరించలేని దుర్వాసన, దోమల స్వైరవిహారంతో ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

» ఎన్టీఆర్ కాలనీలో తుప్పల చాటున సులభ్ కాంప్లెక్స్

» కర్రివారివీధిలో నిరుపయోగంగా మినీ వాటర్ ట్యాంకు

» ఎక్కడికక్కడే చెత్తాచెదారం.. దోమల స్వైరవిహారం

» వార్డు ప్రజలు అగచాట్లు.. పట్టించుకోని అధికారులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వార్డు పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో తుప్పల చాటున సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడంతో స్థానికులు సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లడానికి రాత్రి వేళల్లో ఎక్కడ విషసర్పాలు కాటేస్తాయోనని భయంతో ఉన్నారు. దీనికితోడు సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ లేకపోవడంతో పరిశుభ్రత లోపించింది. గతంలో యల్లయ్య కాలువకు ఇరువైపులా సిమెంట్ గోడలు ఎన్టీఆర్ కాలనీ మదుం వరకు నిర్మించారు. అక్కడ నుంచి కాలువ ప్రవహించే డైట్ కళాశాల వరకు ఇరువైపులా సిమెంట్ గోడలు లేకపోవడంతో కాలువ దెబ్బతింటుంది. ఈ కాలువ నుంచి దుర్వాసనలు వెదజల్లడమే కాకుండా దోమల బెడద కూడా ఎక్కువగా ఉందని వాపోతున్నారు. ఇదిలా ఉండగా జాతీయ రహదారికి అనుకుని తోటాడకు వెళ్లే మార్గంలో గౌరీ కాలనీకి పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ కాలనీలో నివాసముంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇరువైపులా తుప్పలు ఉండడంతో ఈ మార్గంలో చీకటిపడితే ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. కర్రివారివీధిలో మినీ వాటర్ ట్యాంక్ నిరూపయోగంగా ఉంది. గతంలో ఈ రహదారి నిర్మాణం చేపట్టినప్పుడు పైపులైన్ పూర్తిగా దెబ్బతినడంతో అప్పటి నుంచి మినీవాటర్ ట్యాంక్ నిరూపయోగంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా అదే ప్రాంతంలో యల్లయ్య కాలువ ఉండడం, కాలువ మదుం వద్ద చెత్తా చెదారం పేరుకు



ఎన్టీఆర్ కాలనీలో తుప్పల చాటున సులభ్ కాంప్లెక్స్



కర్రివారివీధి యల్లయ్య కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం... (ఇన్‌సెట్‌లో) నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

పోయి ఉండడంతో స్థానిక నివాసస్థులు ఇబ్బందులు పడుతున్నారు. చినరామస్వామి కోవెల వద్ద కూడా రాత్రి వేళల్లో మందుబాబులు హడావుడి చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. తాగునీరు కూడా పలు సందర్భాల్లో ఎక్కువ సేపు రావడం లేదని చెబుతున్నారు. అమృత స్కీమ్ పైపులైన్ పనులు పూర్తి స్థాయిలో చేపట్టడం లేదని కూటమి నాయకులు చెబుతున్నారు. ఈ పనులు పూర్తయితే తాగునీటి సమస్యకు చెక్ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ప్రాంతంలో 140 వరకు డ్వాక్రా సంఘాలు ఉన్నాయని అందుకు అనుగుణంగా సమాఖ్య భవనం నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అన్న క్యాంటీన్లు పట్టణ వాసులకే పరిమితమయ్యాయని గవరపాలెం ప్రాంతంలో కూడా అన్న క్యాంటీన్ ఏర్పాటుచేస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉంటుందని పలువురు అంటున్నారు. కర్రివారి వీధిలోని రైతులు గౌరీ కాలనీ మీదుగా పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. జాతీయ రహదారి ఉన్నందున గతంలో రోడ్డు దాటడానికి అవకాశం ఉన్నప్పటికీ హైవే అధికారులు వారి నిబంధనల ప్రకారం మూసివేయడం వల్ల చుట్టూ తిరిగి పొలాలకు రైతులు వెళ్లి రావాల్సి వస్తుందని అంటున్నారు.

గతంలో మాదిరిగా గవరపాలెంలోని చినరామస్వామి కోవెల, ఎన్టీఆర్ కాలనీ, సంతబయలు, దాసరిగెడ్డ రోడ్డు తదితర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో



గౌరీ కాలనీకి ఈ మట్టి మార్గమే ఆధారం..!

పోలీసులు పహరా కాస్తే బాగుంటుందని ఆ ప్రాంత నాయకులు చెబుతున్నారు. అలాగే ప్రధాన జంక్షన్‌ల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వాటర్ ట్యాంకు అందుబాటులోకి తీసుకురావాలి



-కర్రి గంగాధర్, కర్రివారివీధి

కొంత కాలంగా నిరూపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంకును అందుబాటులోకి తీసుకురావాలి. దీనికితోడు ట్యాంకుకు ఆనుకుని ఉన్న యల్లయ్యకాలువలో చెత్తా చెదారం పేరుకుపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. కాలువల్లో చెత్త తొలగించాలి.

దోమల బాధ తగ్గించండి



-కొణతాల సత్యవతి, ఎన్టీఆర్ కాలనీ

నివాసాలకు ఆనుకుని యల్లయ్య కాలువ ఉండడం వల్ల దోమల బెడద అధికంగా ఉంది. దోమకాటు వల్ల ఎక్కడ అనారోగ్యాల పాలవుతామోనని భయంగా ఉంది. ఇళ్ల ముందు రహదారి నిర్మాణం కూడా చేపట్టాలి. సులభ్ కాంప్లెక్స్‌ను మెరుగుపర్చాలి.

చీకటిపడితే బయటకు రాలేకపోతున్నాం



-విల్లూరి మణి, ఎన్టీఆర్ కాలనీ

చీకటి పడితే ఇళ్లల్లో నుంచి బయటకు రాలేకపోతున్నాం. యువకులు మద్యం తాగి హడావుడి చేస్తున్నారు. రాత్రి ఏడు గంటలు దాటితే బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలి

పల్లె పండగతో గ్రామాల అభివృద్ధి

» అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెల్లడి

» నాలుగు గ్రామాల్లో 17 పనులకు శంకుస్థాపన

కశింకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. వై.తుని, ఎన్.జి.పాలెం, జెడ్.తుని, అడ్డాం గ్రామాల్లో మంగళవారం పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీ, బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వై.తునిలో రూ.85 లక్షలు, ఎన్.జి.పాలెంలో రూ.20 లక్షలు, జె.తునిలో రూ.15.4 లక్షలు, అడ్డాంలో రూ.16.8 లక్షలు, జల జీవన్ మిషన్ పథకం కింద రూ.1.35 కోట్లతో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లెలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ప్రతి పంచాయతీలోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చారన్నారు. అనంతరం అడ్డాం గ్రామంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలాల్లో ఉన్న వ్యవసాయ బావులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి స్వప్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, కూటమి నాయకులు పొన్నగంటి అప్పారావు, చిన్ని కృష్ణ, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కర్రి సత్యనారాయణ, గొంతిన చిరంజీవి, కలిగట్ల సింహాద్రి, యంమంచిలి వెంకట్రావు, మజ్జి నిరంజన్‌కుమార్, ఇందుకూరి వర్మ, రెడ్డి కన్నబాబు, నైనంశెట్టి రమణారావు, సిదిరెడ్డి సూర్యనారాయణ, బుదిరెడ్డి గంగయ్య పాల్గొన్నారు.



అడ్డాం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

రీ సర్వే గ్రామసభను పరిశీలించిన ఎమ్మెల్యే

నర్సింగబిల్లి సచివాలయంలో మంగళవారం న్విహించిన రీ సర్వే గ్రామ సభను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. రీ సర్వే జరిగిన భూములకు సమస్యలు పరిష్కారం చూపాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావుకు సూచించారు. ఈ గ్రామసభలో మొత్తం 169 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రమేష్, మండల సర్వేయర్ రామారావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు, వీఆర్‌వో పృథ్వీ పాల్గొన్నారు.



పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గవరపాలెంలో అన్నసమారాధన

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం నాగేంద్రుని గుడి వద్ద మంగళవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ మంగళవారం చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొడ్డేడ రోషన్‌కుమార్, పీలా రమణారావు, కొణతాల శ్రీనివాసరావు, కోరిబిల్లి మురళీ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి ఉండాలి

సీఐ మల్లికార్జునరావు



పరవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయాలు జరిపే వ్యాపారులు తప్పనిసరిగా పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు సూచించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు జరిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు చేయరాదన్నారు. ఎక్కడైనా బాణసంచా నిల్వలు అక్రమంగా ఉంచితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనుమతులు తీసుకున్న వ్యాపారులు కూడా గ్రామానికి దూరంగా విక్రయాలు జరపాలని సీఐ సూచించారు.

సీతానగరంలో 'పొలం పిలుస్తోంది'

కొత్తూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానగరం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ శాఖ సహాయ సంయుక్త సంచాలకులు రామారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వరిలో పొడ తెగులు, ఆకు ముడత నివారణకు ప్రొపికొనజోల్‌ను రెండు మిల్లీలీటర్లు లీటర్ నీటికి, ఎసిఫెట్ 1.5గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రంగాచారి, సాయిల్ కన్జర్వేషన్ ఏడీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మనిషి పటేల్ సేవలు మరువలేం

సబ్బవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువరానివని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా కళాశాలలో మంగళవారం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మూడు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పటేల్ త్యాగం, కృషి, పట్టుదల గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ పటేల్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, సిబ్బంది ఏవీ నివేదిత, సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు వినియోగించుకోండి: ఏడీఏ రామారావు

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రామారావు

తుమ్మపాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీఏ) రామారావు సూచించారు. తుమ్మపాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో పొడ తెగులు, ఆకుముడత తెగులు అధికంగా ఉన్నాయని చెప్పారు. నివారణకు లీటరు నీటిలో రెండు మిల్లీలీటర్ల ప్రొపికొనజోల్‌లో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి రోజూ రైతులకు సేవలు అందించేందుకు వ్యవసాయ సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల



తుమ్మపాలలో పొలం పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

వ్యవసాయాధికారి పి.రంగాచారి, జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకర్, రైతు సంఘం నాయకులు పీలా తాతునాయుడు, కోన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

25 మద్యం సీసాల స్వాధీనం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తుల నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. దేవీనగర్‌కు చెందిన ఎస్.శ్యామ్‌కుమార్ నుంచి కొత్తూరు పట్టుకు వస్తున్న పది క్వార్టర్ మద్యం సీసాలను, సుంకరమెట్ట జంక్షన్ వద్ద సీహెచ్‌ఎన్ అగ్రహారం గ్రామానికి చెందిన బలిజ దేముళ్ల నుంచి 15 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఇద్దరిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు 'ప్రతిభ' విద్యార్థి



విద్యార్థి భరత్ వర్ధన్‌ను అభినందిస్తున్న దృశ్యం

సబ్బవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు స్థానిక 'ప్రతిభ' విద్యాలయ విద్యార్థి బలిరెడ్డి భరత్‌వర్ధన్ ఎంపికయ్యాడు. పశ్చిమగోదావరి జిల్లా మార్టూరులో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగిన బాస్కెట్‌బాల్ స్టేట్‌మీట్‌లో భరత్‌వర్ధన్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అండర్-17 విభాగంలో ఎంపికయ్యాడు. నవంబరులో జరగ బోయే జాతీయ స్థాయి పోటీల్లో భరత్‌వర్ధన్ పాల్గొంటాడని కరస్పాండెంట్ అదిరెడ్డి రమణ తెలిపారు. భరత్‌వర్ధన్, కోచ్ రాజుతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ ఆస్సీజోషెఫ్, ఆదిరెడ్డి శరత్ అభినందించారు.



పురవీధుల్లో గౌరీ పరమేశ్వరులను ఊరేగిస్తున్న భక్తులు

గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి పురవీధుల మీదుగా ఊరేగించి అగ్గిమర్రి చెట్టు వద్ద గల మండపంలో ఏర్పాటు చేశారు. కొణతాల కారుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీలా వారి గౌరీపరమేశ్వరుల ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు దంపతులు ప్రతి ఏటా మాదిరిగానే అమ్మవారికి పసుపు కుంకుమలు, చీర సమర్పించారు. ఈ ఉత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, కొణతాల ఆది నాగేశ్వరరావు, కాండ్రేగుల తేజ, కాండ్రేగుల మంగ, బొడ్డేడ దుర్గాలక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశుసంవర్థక శాఖ స్థలంలో అక్రమ నిర్మాణం అడ్డగింత


దుకాణ సముదాయాల తొలగిస్తున్న సంవర్థకశాఖ వైద్యుల సంఘం ప్రతినిధులు

అరకులోయ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ప్రధాన రహదారిలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పశుసంవర్థకశాఖకు చెందిన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న దుకాణ సముదాయాలను అడ్డుకున్నట్టు జిల్లా పశు వైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సాగిరి గణేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సందీప్, డుంబ్రిగుడ మండల పశువైద్యాధికారి రాజశ్రీ తెలిపారు. స్థానిక తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పశుసంవర్ధకశాఖకు సంబంధించి బ్లాక్‌బీ ప్లాట్ నంబర్ 29 ,30లో 55 సెంట్ల భూమిని పశు సంవర్ధక శాఖకు ప్రభుత్వం ఇచ్చినట్టు చెప్పారు. ఈ స్థలం అన్యాక్రాంతమవుతుందని కొన్నాళ్లుగా రెవెన్యూ శాఖకు ఫిర్యాదులు చేస్తున్నట్టు చెప్పారు. అయినా, అక్రమణదారులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇకనైనా రివెన్యూ అధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన గోడలను తక్షణం తొలగించాలని కోరారు. మూడు మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించి ఐటీడీఏ కార్యాలయం ధర్నా చేపట్టారు. అనంతరం ఐటీడీఏ ఏపీవోకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. కార్తీక్ శ్రీను, పి.జీవన్ కృష్ణ మాట్లాడుతూ, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర విద్యార్థులకు బకాయి ఉన్న సుమారు రూ. 3,480 కోట్లు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫీజు రియింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరిస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని, వసతిగృహ విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలు పెంచాలని, జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించేలా చూడాలని కోరారు. గిరిజన విద్యార్థుల మరణాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే నవంబరు 6న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి.చిన్నారావు, పి.ఆనంద్‌బాబు, పి.సింహాద్రి, పి.వరహాలబాబు, విద్యార్థులున్నారు.

తమ్మంగుల గ్రామ సర్పంచ్ కాంతమ్మ మృతి



చింతపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని తమ్మెంగుల సర్పంచు బొండా కాంతమ్మ (58) మృతి చెందారు. ఆమె మూడు రోజుల కిందట హృద్రోగ సమస్యతో అస్వస్థకు గురికావడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. పార్థివదేహానికి కుటుంబ సభ్యులు భీమనాపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

కాంతమ్మ మృతి తీరనిలోటు: ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

సర్పంచ్ మృతి తీరనిలోటని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు అన్నారు. మంగళవారం సర్పంచ్ పార్థివదేహానికి ఎమ్మెల్యే, ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాల్లో కాంతమ్మ చురుకైన పాత్ర పోషించారన్నారు.

విజన్- 2047కు అనుగుణంగా అభివృద్ధి: కలెక్టర్

పాడేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విజన్- 2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో ఏటా జిల్లా వృద్ధి 15 శాతం పెరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని, అందుకు గానూ ప్రతి ప్రభుత్వ శాఖలో లక్ష్యాలను నిర్ధారించుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, పశు సంవర్ధక శాఖల నుంచి గిరిజన రైతులకు ప్రోత్సాహం అందాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులందరికీ పనులు కల్పించాలన్నారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో అలక్ష్యం వద్దు: డీఎంహెచ్‌వో


ఉప్ప పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

హుకుంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలక్ష్యం చేయవద్దని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌వో జమాల్ బాషా సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం బాకూరు సమీపంలోని కరకపుట్టు పాఠశాలలో విద్యార్థులకు స్వయంగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, అక్కడ వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి రక్తహీనత లేకుండా చూడాలన్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

చింతపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలకు రైతులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని స్థానిక ఎస్ఎంఐ ఏఈఈ లోకేశ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాజంగి జలాశయం, చౌడుపల్లి, సిరిపురం పెద్ద చెరువు పరిధిలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నీటి సంఘం ఎన్నికల్లో పాల్గొనే రైతుల వివరాలకు కూడిన ఓటరు జాబితా స్థానిక వీఆర్వోల వద్ద ఉందన్నారు. తాజంగి జలాశయం, సిరిపురం, చౌడుపల్లి పెద్ద చెరువు పరిధిలో రైతులు ఓటు హక్కు పొంది ఎన్నికల్లో పాల్గోవాలన్నారు.

'వైసీపీకి ఓటు వేసి మోసపోయిన ఆదివాసీలు'

గూడెంకొత్తవీధి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసి మోసపోయామని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు జనసేన పార్టీ అరకు పార్లమెంట్ కార్యవర్గ సభ్యుడు గొర్లె వీర వెంకట్ తెలిపారు. మంగళవారం మండలంలోని శివారు గొందిపల్లి గ్రామాన్ని జనసేన నాయకులు సందర్శించారు. గ్రామంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు ఇమ్మానుయేలు, పరమేశ్వరరావు, సత్యారావు, రాజు, పొట్టిపడాల్ పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి: ఎస్ఐ

ముంచంగిపుట్టు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మారుమూల లబ్బూరు సమీపంలో మంగళవారం రాత్రి స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టాయి. సోమవారం రాత్రి దారిదోపిడీ దొంగలు మాకవరం సమీపంలో పంచాయతీ సర్పంచ్‌ను తుపాకులతో బెదిరించి దోచుకొనేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు జంక్షన్ల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రా నుంచి ఒడిశా వైపు వచ్చే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమాన్పదంగా ఎవరైనా సంచరించినట్లయితే తమకు సమాచారమివ్వాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆగ్రహం
- హౌసింగ్ అధికారుల చేతివాటంపై మండిపాటు


హౌసింగ్ అధికారులను ప్రశ్నిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి అధికారులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని విశాఖ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సీతమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సమావేశానికి జడ్పీచైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హౌసింగ్‌పై ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇళ్ల మంజూరు, బిల్లుల చెల్లింపులలో పలువురు మండల స్థాయి అధికారులు, సిబ్బంది చేతివాటం చూపుతున్నారని, ఈ తీరు మార్చుకోవాలని చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు జీతాలు సరిపోవడం లేదా అంటూ వారిపై ధ్వజమెత్తారు. అటువంటివి ఏమీ జరగడంలేదని హౌసింగ్ ఏఈ కృష్ణారావు వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. తన వద్ద హౌసింగ్ సిబ్బంది ఒకొక్కరి వద్ద నుంచి వసూలు చేశారో పూర్తి చిట్టా ఉందని, తీరు మార్చుకుంటే బాగుంటుందని ఆమె హెచ్చరించారు. అర్హులందరికీ గృహాలు మంజూరు చేయాలన్నారు. సీహెచ్‌సీతో పాటు పీహెచ్‌సీల వద్ద అంబులెన్స్‌లను నిత్యం అందుబాటులో పెట్టాలని, అంబులెన్స్‌లు అందుబాటులో లేక మారుమూలగ్రామాల నుంచి గర్భిణులు ఆస్పత్రులకు తరలించేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నట్టు సభ్యులు వైద్యులు గీతాంజలి, ప్రతాప్‌లకు తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ కలుగజేసుకుని సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు ఏటా విడుదలవుతున్న నిధులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. ప్రస్తుతం ఏమేరకు ఉన్నాయని వైద్యులను ప్రశ్నించారు. ఈ పూర్తి వివరాలను అందించాలన్నారు. అలాగే ఆస్పత్రులకు సంబంధించి నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలకు పక్కా భవనాలు లేవని, ఉపాధ్యాయుల కొరత ఉందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈవో క్రిష్ణమూర్తికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులు మృతి చెందితే గోప్యంగా ఉంచడం సరికాదని సభ్యులు విమర్శించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం జరగకుండా చూడాలని సభ్యులు రెవెన్యూ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో పేదల కోసంకేటాయించిన ప్రభుత్వ భూముల్లో ఇతరులకు ఎలా ఎల్‌పీసీలు ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఎన్ని ఎల్‌పీసీలు మంజూరు చేశారో వివరాలు అందించాలని జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర రెవెన్యూ అధికారులను కోరారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్, వ్యవసాయ, హార్టికల్చర్, జీసీసీ, ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖలపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ సమావేశానికి మండల స్థాయి అధికారుల గైర్హాజరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నారు. అధికారులపై ఫిర్యాదులు అందితే వాటిపై దర్యాప్తు జరిపి శాఖా పరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీసాయిహర్ష, తహసీల్దార్ నర్సమ్మ, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటాం'


మాట్లాడుతున్న ఎంపీపీ అనుషదేవి, జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్‌ని అడ్డుకుంటామని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య హెచ్చరించారు. మంగళవారం 'మన్యంలో మైనింగ్ మాఫియా పాగా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. చాపరాతిపాలెంలో బాక్సైట్ తరహా లేటరైట్ గనులను తవ్వేందుకు ఎవరు ప్రయత్నించినా ఆదివాసీలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. గతంలోనూ లేటరైట్ తవ్వకాలు ప్రాంభిస్తే అడ్డుకున్నట్టు గుర్తు చేశారు. ఈ తవ్వకాల వెనుక ఏ పార్టీ పెద్దల ప్రమేయం ఉన్నా సహించలేదన్నారు. లేటరైట్ తవ్వకాలతో కాలుష్యం పెరిగిపోతుందన్నారు. కాఫీ, వరి పంటలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సహజ ఊటగెడ్డలు అంతరించిపోతాయన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో అమలులో ఉన్న భూబదలాయింపు, పీసా చట్టాలను ఉల్లంఘించి మైనింగ్ తవ్వకాలు చేపట్టరాదన్నారు. పంచాయతీల్లో గ్రామ సభకు సర్వ అధికారాలు ఉన్నాయన్నారు. పంచాయతీ సర్పంచ్ తవ్వకాలకు వ్యతిరేకంగా తీర్మానం చేస్తే మైనింగ్ మాఫియా ఆగడాలకు కళ్లెంపడుతుందన్నారు. లేటరైట్ తవ్వకాలను అడ్డుకునే బాధ్యత స్థానిక సర్పంచ్, వార్డు సభ్యులపైనా ఉందన్నారు. ఈవిషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజనులకు తాము మద్దతుగా ఉద్యమిస్తామన్నారు.

కార్తీక మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని పురాతన శైవ క్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి దేవి ఆలయంలో కార్తీక మాసోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, ఆధ్యాత్మిక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టగుళ్లి సంహాచలం నాయుడు మాట్లాడుతూ..వచ్చే నెల 2వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు 30 రోజులపాటు ఆలయంలో ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్తీక మాసంలో ఆలయానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చీపురు రమాదేవి, అర్చకులు ఉప్పల రామం, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, వర్తక సంఘం అధ్యక్షుడు ఇమిడిశెట్టి అనీల్, ఆధ్యాత్మిక సేవా బృంద ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, దేశిది బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించేదెప్పుడు?

- మండల సమావేశంలో

గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు ధ్వజం


అధికారులను నిలదీస్తున్న బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ విద్యార్థులకు ప్రాథమిక విద్యను అందిచడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు ఆరోపించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. తొలుత వివిధశాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. విద్యాశాఖపై జరిగిన చర్చలో బుజ్జిబాబు మాట్లాడుతూ తన పంచాయతీ పరిధిలోని పాత్రుగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జూన్ పాఠశాల పునఃప్రారంభం నుంచి నేటి వరకు ఉపాధ్యాయుడుని నియమించకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. పలు మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ వాడమామిడి, అగ్రహారం పాఠశాలకు కూడా ఉపాధ్యాయులను నియమించడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. దీనికి ఎం ఈవో-2 రామన్న మాట్లాడుతూ, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాల నుంచి సంబంధిత పాఠశాలలకు డిప్యూటేషన్‌పై నియమిస్తామన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలులేవని, విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులకు కట్టెల పొయ్యిలోనే వంటలు చేయడంతో సకాలంలో భోజనాటు పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మిని ప్రశ్నించారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు మండల పరిషత్ నిధులు ఖర్చులు, కేటాయింపులపై సభ్యులకు ఎంపీడీవో తెలియజేయాలన్నారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్, ఎంపీటీసీ సభ్యులు కృష్ణమూర్తి, ఎం.సత్యనారాయణ, నాగమణి, ఈశ్వరమ్మ, రాజేశ్వరి, సర్పంచ్ కంకిపాటి వీర వెంకట ప్రసాద్, బుజ్జిబాబులు ˊఎట్టి పరిస్థితుల్లోనూ చాపరాతిపాలెం క్వారీలో లేటరైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలన్నారు. దీనిపై పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ అభ్యంతరం వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు, ఈవోఆర్‌డీ పాపారావు, వైస్‌ఎంపీపీ దేముడు పాల్గొన్నారు.

సీఐ అశోక్ కుమార్ సేవలు అభినందనీయం

గూడెంకొత్తవీధి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లిన స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ సేవలు అభినందనీయమని సర్పంచులు, గిరిజనులు కొనియాడారు. మంగళవారం ధారకొండ ఆలయానికి కుటుంబ సమేతంగా వచ్చిన సీఐ దంపతులను మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సప్పర్ల గిరిజనులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఐ శివారు గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేశారన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై ఐఈఆర్‌పీలకు శిక్షణ

పాడేరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐఈఆర్‌పీలకు ట్యాబ్‌ల నిర్వహణపై తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా డీఈవో పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ..సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు ఏ విధంగా ట్యాబ్ ఉపయోగించాలి అన్న అంశంపై పలు సూచనలందించారు. ట్యాబ్‌ల నిర్వహణపై ఐఈఆర్‌పీలకు స్టేట్ ఐఈ కన్సల్టెంట్ డాక్టర్.నర్సింహరావు, స్టేట్ అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ డాక్టర్. అమ్మినాయుడు, డీర్పీలు మహలక్ష్మినాయుడు, సునీల్ శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ భాస్కరరావు,పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పాడేరురూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుర్తించిన నిరక్షరాస్యులైన డ్వాక్రా సంఘ మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని వయోజన విద్య ఉప సంచాలకులు ఎస్ఎస్.వర్మ సూచించారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో మంగళవారం ఉల్లాస్ పథకంపై ఎంపీడీవోలు, ఏపీఎంలతో నిర్వహించిన ఒక్క రోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, వయోజన విద్యాశాఖ సహాయ ప్రాజెక్టు అధికారి కె.గంగన్నదొర, పి.మధుబాబులు, రిసోర్సుపర్సన్లుగా వ్యవహరించారు. పాడేరు డివిజన్ 11 మండలాల ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎంలు పాల్గొన్నారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. మంగళవారం శాస్త్రవేత్తలు వాతావరణ సమాచారాన్ని ప్రకటించారు. పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో నవంబరు 3తేదీ వరకు కనిష్ఠంగా ఒక మిల్లీమీటరు, గరిష్ఠంగా ఆరు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 25-25.5, కనిష్ఠఉష్ణోగ్రతలు 16.4-18.2 డిగ్రీల మధ్య ఉంటాయన్నారు. గాలిలో తేమ 90-95శాతం ఉంటుందన్నారు.ఆకాశంచాలావరకు మేఘావృతంగా ఉంటుందన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నేత

అనంతగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస- అరకు రైల్వేలైన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కిల్లో మోస్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. జీవో ప్రకారం కార్మికుడికి రోజుకి రూ.526ఇవ్వాల్సి ఉండగా.. రూ.10,290 జీతం ఇచ్చి, కాంట్రాక్టరు చేతులు దులుపుకుంటున్నారన్నారు.సంబంధించిఅధికారులు స్పందించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు డౌనూరు సంత వేలం

కొయ్యూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో డౌనూరు వారపు సంతలో ఆశీలు వసూలుకు బుధవారం వేలం నిర్వహించనున్నట్టు సర్పంచ్ పొట్టిక భవాని తెలిపారు. మూలపేట, చిట్టింపాడు గదబపాలెం తదితర పంచాయతీలకు చెందిన వారు వేలంలో పాల్గొని సహకరించాలని కోరారు.

ఆటో బోల్తా.. మహిళకు తీవ్ర గాయాలు


గాయపడిన తులావతి

సీలేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సీలేరు-పాలగెడ్డ మార్గంలో శాండికోరి వద్ద సర్వీసు ఆటోఅదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పాలగెడ్డ గ్రామానికి చెందిన కిముడు తులావతి, ఇద్దరు కుమార్తెలు తదితరులు ధారాలమ్మను దర్శించుకునేందుకు ఉదయం వెళ్లారు. మొక్కులు తీర్చుకుని తిరుగు ప్రయాణంలో సీలేరు నుంచి పాలగెడ్డకు సర్వీసు ఆటో వెళుతుండగా శాండికోరి వద్ద ఆటోకు బ్రేకులు ఫెయిలై చెట్టుకు ఢీకొని బోల్తాపడింది. ఈఘటనలో తులావతి తలకు బలమైన గాయమైంది.దీంతో ఆమెను సీలేరు పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి ప్రాథమిక చికిత్స అందించి చింతూరు ఆస్పత్రికి తరలించారు.

కాలేజీ మైదానంలో బాణసంచా విక్రయాలు వద్దు: ప్రిన్సిపాల్

పాడేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బాణసంచా విక్రయాలను చేపట్టకుండా చర్యలు చేపట్టాలని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసరావు కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కళాశాలకు ఆనుకుని ఉన్న క్రీడా మైదానంలో బాణసంచా విక్రయాలకు స్టాళ్లు ఏర్పాటు చేయడంతో విద్యార్థుల బోధనకు అసౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.

బీసీజీ టీకాలు వేయాలి

హుకుంపేట అక్టోబరు 29 (ఆంధ్రజోతి) ; 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్రూ బీసీజీ టీకా తప్పనరిగా చేయించుకోవాలని డీఐవో జిల్లా ప్రో గ్రాం అధికారి సాధన తెలిపారు. పీహెచ్‌సీని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా టీబీ, రోగులు, బీపీ షుగర్ రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు రికార్డులు పరిశీలించారు అనంతరం ఈకార్యక్రమంలో వైద్యాధికారి మోహనరావు, జిల్లా టీబీ కోఆర్డినేటర్ శేషగిరి, సిబ్బంది వెంకటేశ్వర్, సదానందం, నగేష్, ధనరాజ్ పాల్గొన్నారు.


లో వోల్టేజీ సమస్యపై ఆందోళన

పెదబయలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెదబయలులో విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమయ్యారని జిల్లా ఎస్సీఎస్టీ కమిటీ సభ్యుడు చెండా లోహిదాసుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనేక వీధుల్లో లోవోల్టేజీ సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. పట్టించుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఆయనవెంట శ్రీనివాసరావు, కృష్ణకుమార్, దామోదరం, ఉదయ్,చందు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

టీడీపీ అరకు పార్లమెంటరీ నియోజవర్గ ఇన్‌చార్జి

కిడారి శ్రావణ్‌కుమార్


పెద్దబురులులో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, తదితరులు

హుకుంపేట అక్టోబరు 29 (ఆంధ్రజోతి); కూటమి ప్రభుత్వంతోనే గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని టీడీపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మత్స్యపురం పంచాయతీ పెద్దబురుగులులో పర్యటించారు. స్థానిక గిరిజనులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధిలో పూర్తి నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలను కూడా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పథకాల అమలు ముందుంటుందన్నారు. ముఖ్యమంత్రి చం ద్రబాబు ఎన్నికల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ. 4వేలకు పెంచారన్నారు. దీపావళి నుంచి ప్రతి కుటుంబానికి ఉచిత గ్యాస్ అమలు చేస్తారన్నారు. కార్యకర్తలు, అభిమానులు టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకోవాలన్నారు. సభ్యత్వ నమోదతో బీమా వర్తిస్తుందన్నారు. ఈకార్యక్రమనికి సర్పంచ్ బాకురు వెంకట రమణ, ఎంపీటీసీ సభ్యులు కోమ రమ , శోభకోట సర్పంచ్ శశిభూషణ్‌నాయుడు , ఆండిభ సర్పంచ్ సత్యనారాయణ తెలుగు మహిళ అధ్యక్షురాలు సాగిరి సత్యవతి, సూర్యకాంతం, నాయకులు చపాలి శంకర్, మాజీ సర్పంచ్ పాడి బాలన్న అచ్చమ్మ పాల్గొన్నారు.

సమష్టిగా గ్రామాల అభివృద్ధి: అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి: అందరి సహకారంతో గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తామని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని జీనబాడు పంచాయతీ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పెదగంగవరంవరకు రూ.59 లక్షలతో తారురోడ్డు పనులకు, అరకు నియోజకవర్గ ఇన్‌చార్జీ సీవేరి దొన్నుదొరతో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జీనబాడు గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు, సర్పంచులు మాధవి, గణేశ్, ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మి, స్వామి, గంగన్నదొర, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి

హుకుంపేట; సీసీ రోడ్డు పనులు కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీపీ కూడా రాజబాబు, వైస్ ఎంపీపీ కొండలరావు సూచించారు. మంగళవారం మండలంలోని రాప పంచాయతీ కోటగరువు గ్రామంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నుంచి15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 10లక్షలు ఈ రహదారికి కేటాయించినట్టు చెప్పారు. ˊఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగలక్ష్మి, నైని సత్తిబాబు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా టీడీపీ సభ్యత్వ నమోదు

పాడేరురూరల్: మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్ తెలిపారు. మోదాపల్లి పంచాయతీలో ఇంటింటికి వెళ్లి అర్హులకు సభ్యత్వాలను అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన గిరిజన గ్రామాల్లో ప్రజలు పార్టీ సభ్యత్వానికి ఉత్సాహంగా వస్తున్నారని నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు డప్పోడి వెంకటరమణ, మండల రైతు సంఘం అధ్యక్షుడు రేగం కొండబాబు, నాయకులు రాంబాబు, దొర అప్పన్న, భాస్కరరావు, మర్రి సన్యాసి పాల్గొన్నారు.



కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

జిల్లాలో పది ఎంపీడీవో పోస్టులు ఖాళీ

▸▸ జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

మాకవరపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పది మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని జిల్లా పరిషత్ సీఈవో నారాయణ మూర్తి తెలిపారు. మంగళవారం మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 39 మండలాల్లో 29 మంది ఎంపీడీవోలు ఉన్నారన్నారు. ఇద్దరు దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారని, ఎనిమిది పోస్టులు భర్తీ కావాల్సి ఉందని చెప్పారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సీఈవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



వెంకన్నపాలెంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈ

మాకవరపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న రహదారుల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ వీరన్ననాయుడు సూచించారు. మండలంలో శెట్టిపాలెం, వెంకన్నపాలెం, భీమబోయినపాలెం గ్రామాల్లో ఉపాధి పథకం నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. అలాగే రోడ్డు పనులతో పాటు పాఠశాలలకు ప్రహరీ గోడలు కూడా నిర్మిస్తున్నట్టు చెప్పారు. నాణ్యతాప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్ఈ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో చుక్క నీరివ్వని చేతి బోర్లు



బస్ స్టేషన్ సమీపంలో పనిచేయని బోరు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో చేతి బోర్లు పనిచేయడం లేదు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఏఎల్ పురం మెయిన్ రోడ్డు, కార్పెంటర్ కాలనీ బోరు చుక్క నీరు ఇవ్వడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే వీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జనసేన నేత



మంత్రి బండి సంజయ్‌ను కలిసిన జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ పర్యటనకు వచ్చిన బండి సంజయ్‌ను కలిసి జిల్లాలోని పరిస్థితులు, స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఘటాలను తీసుకు వెళుతున్న భక్తులు

మాడుగుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని అలంకరించిన తర్వాత అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మరికొంతమంది భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. భక్తులకు కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

▸▸ కొత్తకోట సీఐ కోటేశ్వరరావు



రావికమతం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించినా.. తయారు చేసినా.. నిల్వ చేసినా కేసులు నమోదు చేస్తామని కొత్తకోట సీఐ జి. కోటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీపావళి, నాగుల చవితి పండగలకు బాణసంచా విక్రయాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు. అనుమతులున్నా జనవాసాల మధ్య విక్రయాలు గాని, నిల్వ గాని చేయకూడదన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కవ్వగుంటలో నీటి పథకం పునరుద్ధరణ

రావికమతం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురైన కవ్వకుంట రక్షిత నీటి పథకాన్ని ఈ గ్రామ సర్పంచ్ దాసరి సూర్యకుమారి చొరవతో మంగళవారం పునరుద్ధరించారు. ఇటీవల ఈ పథకం మోటారు కాలిపోవడంతో తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు తాగు నీటికి ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని సర్పంచ్ సూర్యకుమారి దృష్టికి గ్రామస్థులు తీసుకు రావడంతో మెకానిక్‌ను రప్పించి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెచ్చారు.

సాగుదారులకు న్యాయం చేయండి

రోలుగుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లగా సాగుచేసుకుంటున్న భూముల విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ నాగమ్మకు జేపీ అగ్రహారం రైతులు విన్నవించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ సిబ్బందిని మరో మారో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో వీఆర్వో రాము, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. సాగుదారులతో రికార్డులను పరిశీలించారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

సమస్యల స్టేషన్

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు కరువు

తిరగని ఫ్యాన్లు.. నిరుపయోగంగా కుళాయిలు

ప్రయాణికుల పాట్లు.. పట్టించుకోని అధికారులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సమస్యలు కొలువు తీరాయి. కాంప్లెక్స్‌లో కనీస సదుపాయాలు కరువయ్యాయి. తాగునీరు అందుబాటులో లేకపోవడంతో పాటు ఫ్యాన్లు తిరగకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణాదేవిపేట బస్ స్టేషన్‌లో ఐదేళ్ల క్రితం అల్లూరి సీతారామ రాజు వర్తక సంఘం ప్రతినిధులు రూ.30 వేలు వెచ్చించి ఆర్వో ప్లాంట్ వితరణ చేశారు. రెండేళ్ల పాటు పరిశుద్ధ తాగునీరు ప్రయాణికులు అందుబాటులో ఉండేది. ఏడాది క్రితం ఇది మూలకు చేరింది. అప్పటి నుంచి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రయాణికులు, బస్సు కోసం వేచివుండే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ప్రయాణికులు సేదతీరే కుర్చీలు సగానికిపైగా మరమ్మతులకు గురయ్యాయి. దోమల బెడద ఉన్నప్పటికీ ఒక్క ఫ్యాన్ కూడా తిరగడం లేదు. సంబంధిత అధికారులు ఈ సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్ స్టేషన్‌లో నిరుపయోగంగా ఉన్న ట్యాంకు, కుళాయి

జిల్లా స్థాయి బృందగానం పోటీలు

నర్సీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల ప్రతిభా పాటవ పోటీలలో మంగళశారం జూనియర్స్ విభాగంలో బృందగానం పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 35 బృందాలు పాల్గొన్నాయి. బుధవారం సీనియర్ విభాగంలో బృందగానం పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు ఇస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ తెలిపారు.

పాకలపాడు రీ సర్వే గ్రామసభలో 86 దరఖాస్తులు

గొలుగొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాకలపాడు రెవెన్యూ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో వివిధ సమస్యలపై 86 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఫైన్లు, వీఆర్‌వోలు నల్లబెల్లి రాజు, పడాల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

గొలుగొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లోనూ టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతున్నది. జోగంపేట, గొలుగొండ, కొత్తమల్లంపేట, గుండుపాల, చీడిగుమ్మల, పాకలపాడు, ఏటిగైరంపేట, పాతమల్లంపేట తదితర గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా సభ్యత్వం నమోదు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు మాట్లాడుతూ మండలంలోని 2024-26 సంవత్సరానికి పది వేలకుపైగా సభ్యత్వాలు నమోదు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండేపల్లి రాము, గెడ్డం ఆనంద్, కామిరెడ్డి గోవింద్ పాల్గొన్నారు.

కుండపోత వర్షం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద హోరున కురుస్తున్న వాన

కృష్ణాదేవిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం, కొంగశింగి, సిహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం పడింది. ఉదయం నుంచి ఎండకు హడలిపోయిన ప్రజలు కొంతమేరకు సేదతీర్చుకున్నారు. వారం రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. అయితే ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో వర్షం ఎటుపోలేని దుస్థితి ఏర్పడింది. దీంతో సీసీ రోడ్డుపై వర్షంనీరు ప్రవహించింది. ఈ వర్షం కూరగాయాలు సాగుకు, జీడిమామిడి తోటలకు ఎంతగానో మేలు చేకూరుస్తుందని రైతులు ఆశాబావం వ్యక్తం చేశారు.

శరవేగంగా సీసీ రోడ్లు నిర్మాణం



లింగంపేటలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని లింగంపేట, చోద్యం, కొంగసింగి తదితర గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలో సీసీ రోడ్ల కోసం స్పీకర్ అయ్యన్నపాత్రుడు సుమారు రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధుల్లో లింగంపేటలో రూ.20 లక్షలతో మంగళవారం రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఏళ్ల తరబడి మట్టి మార్గంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న తమకు సీసీ రోడ్డు నిర్మాణంతో రవాణా కష్టాలు గట్టెక్కినట్టేనని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పథకాల సమాచారం ఎందుకు ఇవ్వడం లేదు

▸▸ గోకులం షెడ్‌ల మంజూరు జాప్యం చేస్తున్నారు

▸▸ అధికారులపై మండిపడ్డ ప్రజాప్రతినిధులు



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమం సమాచారం ప్రజాప్రతినిధులకు ఎందుకు ఇవ్వడం లేదని ఎంపీటీసీ సభ్యుడు మొల్లి.కృష్ణమూర్తి అధికారులను నిలదీశారు. మంగళవారం ఎంపీపీ చింతల.బుల్లిలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామకంఠం భూములు సర్వే చేసి రక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. గోకులం షెడ్లు మంజూరయ్యాయని పశువైద్యాధికారి మంజుషారాణి సభకు తెలపగా.. పలువురు ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారు. గోకులం షెడ్ల నిర్మాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. ఎంతమందికి మంజూరు చేశారని బి.కింతాడ, నాగయ్యపేట సర్పంచులు బాబూరావు, కర్రి పుష్ప నిలదీశారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ 572 దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో అధికారులు సమాచారం ఇచ్చేవారని, ప్రస్తుత అధికారులు సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇకపై అలా జరగదని ఎంపీడీఓ సువర్ణరాజు బదులిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, ఎంపీపీ బుల్లి లక్ష్మి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా



సభ్యత్వం చూపుతున్న టీడీపీ నాయకులు

చీడికాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నుండి సభ్యత్వం తీసుకున్నవారందరికీ ప్రమాదబీమా ఉంటుందని జెబి.పురం ఎంపీటీసీ మాజీ సభ్యులు రాకోట వెంకట సత్యనారాయణ అన్నారు. మండలంలోని జెబి.పురం గ్రామంలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ నాయకులు వరహాలునాయుడు, మిస్కా రామరాజు, దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్‌లో..

మండలంలోని టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ సాగుతున్నది. మంగళవారం పోతనపూడి అగ్రహారంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేశారు. పలువురు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంబమూర్తి, షైచర్ల నానాజీ, మడగల రమణ, సూరిబాబు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల నిల్వకు కోల్డ్ స్టోరేజ్ కావాలి



మాడుగులరూరల్: రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో వాసుదేవరావు

కె.కోటపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈప్రాంతంలో కూరగాయలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. మంగళవారం ఆర్లి, కె.సంతపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధి కారులు నిర్వహించారు. వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను రైతులు కోరారు. కె.సంతపాలెం క్షేత్ర సందర్శనలో కాలీఫ్లవర్, ఉల్లి పంటలను ఏవో సోమశేఖర్ పరిశీలించి, తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులను సూచించారు. కార్యక్రమంలో బోలెం సత్యనారాయణమూర్తి, బండారు దొరబాబు, బండారు రమణ పాత్రుడు, బోలెం సత్యనారాయణ, బోలెం సూర్యనారాయణ, వీహెచ్ఏ కుమార్, సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్‌లో..

మండలంలోని జంపెన, విజెపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో వాసుదేవరావు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. వరి పంటలకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి సకాలంలో క్రిమిసంహారక మందులు పిచికారి చేయాలన్నారు. ఏఏ తెగుళ్లకు ఏఏ క్రిమిసంహారక మందులు పిచికారి చేయాలో వివరించారు. రబీ పంటకు రైతులో స్వచ్ఛందంగా భీమా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. మినప పంటకు ఎకరానికి రూ171 చొప్పున , పెసరకు రూ157లు, నువ్వు పంటకు రూ180లు ఈ ఏడాది డిశెంబరు 15లోపు చెల్లించాలని వరి పంటకు ఎకరానికి రూ435లు ఈ ఏడాది డిశెంబరు 31 నెలాఖరులోపు చెల్లించాలని సూచించారు. పంట రుణాలు తీసుకున్న రైతులకు భీమా ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులే మినహాయించుకుంటాయని, రుణాలు తీసుకోని రైతులు అవసరమైన ధ్రువపత్రాలు తీసుకుని కామన్ సర్వీస్ సెంటర్‌లో నిర్వాహకులు ద్వారా జాతీయ పంట భీమా పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుని పంటల భీమా చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు జయరాం, అప్పారావు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు లభించని అనుమతులు

▸▸ పండుగకు ఒకరోజే ఉందంటున్న వ్యాపారులు

మాడుగుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలో బాణసంచా విక్రయాలకు అధికారులు ఇంకా అనుమతులు ఇవ్వలేదు. ప్రతీ ఏడాది వలె అనుమతుల కోసం వెళ్లిన బాణసంచా వ్యాపారులకు ఎన్‌వోసీ ఇవ్వకుండా తిప్పుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులిస్తేగాని ఎన్‌వోసీ ఇవ్వడం జరగదని అధికారులు చెబుతున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అన్ని శాఖలకు సంబంధించి రూ.30 వేలకు పైగా చేతులు తడపాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇలా అయితే మాకు వచ్చే లాభం ఏంటని వ్యాపారులు వాపోతున్నారు. గత ఏడాది అగ్నిమాపక అధికారులు ఎన్‌వోసీ ఇచ్చేందుకు ఒక్కో వ్యాపారి నుంచి వసూలు చేయడంతో జిల్లా అగ్నిమాపక అధికారికి ఫిర్యాదులు వెళ్లాయి. అదేవిధంగా ఈ ఏడాది ఎన్‌వోసీకి రూ.5వేలు డిమాండ్ చేస్తున్నారని వ్యాపారులు తెలిపారు. అలాగే రెవెన్యూ, పోలీస్, పంచాయతీ దిగువస్థాయి సిబ్బంది కూడా డిమాండ్ చేస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ రమాదేవి వద్ద ప్రస్తావించగా.. అలాంటిదేమి లేదని, బస్టాండ్‌కు 300 మీటర్ల దూరంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బాణసంచా విక్రయించాలని ఆదేశించినట్టు చెప్పారు. అలాగే ఎస్ఐని వివరణ అడిగేందుకు ప్రయత్నించగా.. ఫోన్‌లో అందుబాటులో లేరు. అగ్నిమాపకాధికారి రాజేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. ఎన్‌వోసీ కోసం తాము ఎవరి వద్ద డబ్బులు అడగలేదన్నారు.

రూ. 75లక్షలతో గౌరీశ్వర ఆలయ పుష్కర ఘాట్ అభివృద్ధి

▸▸ ఎమ్మెల్యే రాజు



పుష్కర ఘాట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కర ఘాట్‌ను రూ.75లక్షలతో అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. మంగళవారం స్వయంభూ గౌరీశ్వరాలయంలో పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గౌరీశ్వరాలయం పుష్కరిణితోపాటు ఆలయంలో ఇతర అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడతామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శాంతారాం. నాయకులు మల్లునాయుడు, గూనూరు సురేష్, గూనూరు మూలినాయుడు, నౌడు సుధాకర్, ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదు : తహసీల్దార్

మాడుగుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ కె రమాదేవి హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పేదవారి ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నదన్నారు. కొంతమంది సొంత అవసరాల పేరుతో విక్రయాలు చేస్తున్నారని, ఇప్పటికే తన పరిశీలనలో వెల్లడైందన్నారు. అలాంటి వారిపై పీడీ యాక్టు ప్రయోగిస్తామన్నారు. ఇసుక తరలించే వారి దగ్గర ఈ ట్రాన్సిట్ రిపోర్టు ఉండాలని, ప్రతీ వాహనానికి జీపీఎస్ ఉండాలన్నారు. సొంత అవసరాలకని చెప్పి విక్రయాలు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

మంగళగిరిలో అర్జీలు స్వీకరించిన తాతయ్యబాబు



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదరబార్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా దర్బార్‌లో స్వీకరించిన వినతులు పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్టు తాతయ్యబాబు తెలిపారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో గురుకుల విద్యార్థులకు ద్వితీయ స్థానం



గురుకుల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

దేవరాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన జోనల్ స్థాయి సైన్స్ అండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు తయారు చేసిన నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ టాపిక్‌పై వేసిన పెయింటింగ్‌కు ద్వితీయ స్థానం లభించిందని ప్రిన్సిపాల్ పి.రఘు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఆకర్ష్, సుధీర్, సంజయ్‌లు, ఉపాధ్యాయుడు అర్జున్‌లను జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్. రూపవతి అభినందించారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేటలో మంగళవారం బ్లెస్సింగ్ చర్చి ఆవరణలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. సీఎస్‌సీ మినిస్ట్రీ అధినేత బిస్సాప్ సుధీర్ మహంతి, చర్చి పాదర్ రాజేష్ నిర్వహించిన బ్లడ్ బ్యాంకు, నేత్ర వైద్య శిబిరం, జనరల్ వ్యాధుల వైద్య శిబిరానికి పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. యువకులు రక్తదానం చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి ప్రారంభించారు. ఈ శిబిరంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు, సర్పంచులు సుంకర లక్ష్మి, పెదిరెడ్ల మాణిక్యం, గొన్నాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ఆర్థిక మోసాల నుంచి రక్షణ : ఎస్ఐ

బుచ్చెయ్యపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలతో ఆర్థిక మోసాల నుంచి బయటపడొచ్చునని ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దన్నారు. లావాదేవీలను బ్యాంకులతో ధ్రువీకరించుకోవాలన్నారు. అధిక లాభాల పథకాల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. కేవైసీ నవీకరణను వ్యక్తిగతంలో చేసుకోవాలన్నారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 నంబర్‌కి డయల్ చేయాలన్నారు. నేషనల్ కస్టమర్ హెల్ప్‌లైన్ (1800-11-4000), సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (సైబర్ క్రైమ్.జీఓవి.ఇన్), స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.

కేశవస్వామి ఆలయ భూముల కౌలు వేలం పాట ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

రావికమతం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట కేశవ స్వామి ఆలయ భూములకు మంగళవారం నిర్వహించిన వేలం పాటను నర్సీపట్నంకు చెందిన కర్రి రమణ బాబు దక్కించుకున్నారు. ఈ ఆలయానికి చెందిన సర్వే నంబరు 165లో 12.08 ఎకరాల మెట్టు, పల్లం పంట భూములున్నాయి. అయితే ఆరేళ్ల పంట కాల పరిమితికి దేవదాయ శాఖ వేలం పాట నిర్వహించగా 28 మంది రైతులు పాల్గొన్నారు. వేలం పాటలో పాల్గొన్న ఆరుగురులో నర్సీపట్నంకు చెందిన కర్రి రమణబాబు ఏడాదికి పంట కౌలుగా రూ. లక్షా 47వేలకు పాడారు. అలాగే మూడేళ్ల అనంతరం 30 శాతం కౌలు రుసుం పెంచాలని నిర్ణయించినట్టు దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారిణి కేబీ ఆశా కిరణ్మయి తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరం గ్రూప్ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్‌వీవీ సత్యనారాయణమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాడుగులలో జోరు వర్షం

మాడుగుల రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాడుగులలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి వాతావరణం సాధారణంగా పొడిగా ఉంది. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలలో ఒక్కసారిగా తేలికపాటి జల్లులతో ఆరంభమై అరగంట సేపు జోరు వర్షం పడింది. ఒక్క మాడుగులలోనే వర్షం పడింది.

మూడు కిలోల గంజాయితో పట్టుబడిన యువకులు

దేవరాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం వై.జంక్షన్ వద్ద మూడు కిలోల గంజాయితో ఇద్దరు యువకులు పట్టుబడినట్టు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. విశాఖపట్నంకు చెందిన తొట్ల శశికుమార్(21), వంగలపూడి తనూజ్ (20) ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకువస్తుండగా శ్రీరాంపురం వై.జంక్షన్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డారని, కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

మిద్దెపై తోట!

ఉద్యానవనాన్ని తీర్చిదిద్దిన ఝాన్సీ


ఝాన్సీ సాగుచేస్తున్న మిద్దెతోట

(మధురవాడ-ఆంధ్రజ్యోతి)

పట్టుదల, దానికి తగ్గ కృషి, చేసే పనిలో మమేకమైతే అద్భుతాలు సృష్టించవచ్చునని నిరూపించారు మధురవాడ స్వతంత్రనగర్ కాలనీకి చెందిన బంగారు ఝాన్సీ. మొక్కల పెంపకంపై అమితాసక్తి ఉన్నప్పటికీ అందుకు తగ్గ స్థలం లేకపోవడంతో మిద్దెపై మిరాకిల్ సృష్టించారు. సాధారణ కూరగాయలతో పాటు, ఈ ప్రాంతానికి అంతగా అనువుకాని మొక్కలను చక్కగా సాకి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. వీటితో పాటు పండ్లు, పూల మొక్కలతో తన ఇంటిని నందనవనంగా మార్చేశారు.

పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సేద్యం

- 50 రకాల పండ్లు, పూల మొక్కల సాగు


పనస

మొక్కల పెంపకానికి అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో మిద్దె తోటపై అవగాహన పెంచుకున్న ఝాన్సీ తమ ఇంటి డాబాపై సుమారు 540 చదరపు అడుగుల స్థలాన్ని కూరగాయలు, పూలమొక్కలు, పండ్ల మొక్కలు పెంచడానికి వీలుగా మార్చేశారు. కుండీలలోనే మొక్కలను నాటి, అద్భుతాలు సృష్టించారు. భర్త బంగారు అశోక్ సహాయంతో పూర్తి సేంద్రియ పద్ధతిలో ముందు పూల మొక్కలతో మొదలైన ప్రస్థానం ప్రస్తుతం కూరగాయలు, పండ్ల మొక్కలతో పాటు అనేక అరుదైన రకాల మొక్కల పెంపకానికి చేరుకుంది.


పండించిన కూరగాయలుతో ఝాన్సీ

50 రకాల మొక్కలు..

ఝాన్సీ తమ మిద్దె తోటలో సుమారు 50 రకాల మొక్కలు పెంచుతున్నారు. ఇందులో అరటి, సపోటా, పనస, డ్రాగన్‌ఫ్రూట్, బత్తాయి, అవకాడో, రామాఫలం, సీతాఫలం, మామిడి, హనుమ, చెర్రీ, మల్బరీ, కర్బూజా, సింగపూర్ నిమ్మ, వాక్కాయలు, బత్తాయి తదితర మొక్కలున్నాయి. వీటితో పాటు బంతి, చామంతి, గులాబీ, సంపెంగ, లిల్లీ, మల్లె, సన్నజాజి, విరజాజి తదితర పూలమొక్కలు, టమాటా, అరటి, సీమ పెండలం, బీర, బెండ, కాకర, వంకాయ, చిక్కుడుకాయలు, బరబాటి, మునగ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బెంగళూరు మిరప, నూల్‌కోల్, క్యారెట్ తదితర కూరగాయలు సాగు చేస్తున్నారు. అంతేకాదు మన వాతావరణానికి అంతగా సరిపడని యాపిల్, దాల్చినచెక్క, యాలకులు కూడా పండించి ఓహో అనిపించుకుంటున్నారు. ఝాన్సీ సాగు విధానాన్ని పరిశీలించిన ఎంతో మంది అధికారులు ప్రశంసలందించారు. అంతేకాదు 2022-23 సంవత్సరానికి ముప్పవరపు ట్రస్ట్ రైతునేస్తం అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చేతుల మీదుగా అందుకున్నారు.


నారింజ

ఎంతో తృప్తిగా ఉంది

చిన్నప్పటి నుంచీ మొక్కల పెంపకంపై ఆసక్తి. మిద్దె సాగుపై అవగాహన పెంచుకుని, సాగుకు సమాయత్తమయ్యాను. ఇక్కడ పండిన కూరగాయలు, పండ్లు, పూలు అందరికీ పంచుతుంటాను. వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారుచేసుకుని మొక్కలకు వినియోగిస్తా. ఇంగువ, వేప ద్రావణాలు పిచికారీ చేసి తెగుళ్లు సోకకుండా కాపాడుతుంటా. - బంగారు ఝాన్సీ


కర్బూజా

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తిని మంగళవారం పునరుద్ధరించారు. ఈ యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో శనివారం ఉత్పత్తి నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో అన్ని యూనిట్లలోనూ ఉత్పత్తి పూర్తి స్థాయిలో జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

కెనడాలో ఉద్యోగాల పేరిట మోసం

- నిందితుడి అరెస్టు


నిందితుడు శ్రీనివాస్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కెనడాలోని సూపర్‌మార్కెట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి మోసం చేసిన కేసులో నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీప గొల్లపాడు ప్రాంతానికి చెందిన దాలబోయిన శ్రీనివాస్ మల్కాపురంలోని బంధువుల ఇంటికి తరచూ వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో స్థానికుడైన అంగ శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. ఈ సందర్భంగా తాను కెనడాలో ఉద్యోగంచేసేవాడినని, అక్కడి సూపర్‌మార్కెట్ యాజమాన్యంతో మంచి పరిచయాలున్నాయని, మనవారు ఎవరైనా ఉంటే ఉద్యోగాలు ఇప్పిస్తానని, మంచి జీతం వస్తుందని నమ్మబలికాడు. దీంతో శ్రీనివాస్‌తో పాటు మరో పది మంది కలిసి రూ.11 లక్షలు చెల్లించారు. డబ్బులు చేతికి అందిన తరువాత అదిగో ఇదిగో అంటూ కొంతకాలం గడిపాడు. అతడి ప్రవర్తన మీద అనుమానం రావడంతో బాధితులు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు దాలబోయిన శ్రీనివాస్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించగా, చేసిన తప్పును అంగీకరించాడు. దీంతో అతడిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. సీఐ విద్యాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

పక్కాగా ఉచిత వంట గ్యాస్ పథకం

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి


అధికారులు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం కోసం ప్రవేశపెట్టిన దీపం-2 పథకాన్ని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులు, గ్యాస్ ఏజెన్సీలపై ఉందని జాయింట్ కలెక్టర్ జాహ్నవి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ నెల 31వ తేదీన ప్రారంభం అయ్యే దీపం-2 పథకం కింద తెల్ల రేషన్ కార్డు లేదా బియ్యం కార్డు వున్న కుటుంబాలకు ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆధార్ నంబరు, తెల్ల రేషన్ కార్డు లేదా బియ్యం కార్డు నంబరు, ఆధార్ నంబరుతో లింకు చేసిన బ్యాంకు ఖాతా వివరాలు, గ్యాస్ కనెక్షన్ నంబరుతో ఈ-కేవైసీ చేయించాలన్నారు. జిల్లాలో అన్ని గ్యాస్ కంపెనీల ఆన్‌లైన్ పోర్టల్‌లో లబ్ధిదారుల జాబితా అందుబాటులో ఉందన్నారు. వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే లబ్ధిదారులు గ్యాస్ ధరను ముందుగా ఏజెన్సీ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. బ్యాంకు ఖాతా అనుసంధానం అయిన లబ్ధిదారుల మొబైల్ నంబర్‌కు ఒక మెసేజ్ వస్తుందని, ఇది వచ్చిన 48 గంటల్లో లబ్ధిదారుల ఆధార్ నంబరుతో అనుసంధానం అయిన బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని ఆమె వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి మూర్తి, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారి కుటుంబానికి తోటి ఉద్యోగులు అండ

- అనాథలైన కుమార్తెలకు రూ.30 లక్షలు ఆర్థిక సాయం
- స్పెషల్ సీఎస్ చేతుల మీదుగా చెక్కు అందజేత


వ్యవసాయాధికారి ఉమామహేశ్వరరావు కుమార్తెలకు రూ.30 లక్షల చెక్కును అందజేస్తున్న బుడితి రాజశేఖర్, వ్యవసాయాధికారులు

సబ్బవరం, అక్టోబరు 29 (అంధ్యజ్యోతి): విజయనగరంలో మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మోపాడ ఉమా మహేశ్వరరావు కుటుంబానికి రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు అండగా నిలిచారు. రాష్ట్ర వ్యవసాయాధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.ప్రవీణ్ ఇచ్చిన పిలుపు మేరకు వ్యవసాయాధికారులు రూ.30 లక్షల నగదు సమకూర్చారు. ఈ మొత్తాన్ని విశాఖపట్నంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతుల మీదుగా దివంగత ఉమామహేశ్వరావు కుమార్తెలు కార్తీక, వైశాలీలకు చెక్కు రూపంలో అందజేశారు. ఉమా మహేశ్వరరావు సొంతూరు విజయనగరం జిల్లా ఎస్.కోట. ఆయన భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఉమా మహేశ్వరరావు చనిపోవడంతో వీరి ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారు. పెద్ద అమ్మాయి ఇంటర్, చిన్నమ్మాయి పదో తరగతి చదువుతున్నారు. చెక్కు అందజేసిన కార్యక్రమంలో ఏపీఏవోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయప్రసాద్, సంఘం నేతలు పోతల సత్యనారాయయణ, మాణిక్యాంబిక, టి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 7న ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశం

- ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్
- హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం-2024 డిసెంబరు ఏడో తేదీన నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ (ఏఏఏ) చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఏయూ అలుమ్ని అసోసియేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టి గ్రూపు చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్వీ ఆదినారాయణ హాజరుకానున్నారన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నట్టు తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో మూడు గంటల నుంచి సమావేశం జరుగుతుందన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఏయూ పూర్వ విద్యార్థుల వ్యవస్థాపక సంఘం అధ్యక్షులు డాక్టర్ జీఎంఆర్ ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని నిరంతరం పనిచేస్తున్నారన్నారు. ఏయూను ఐఐటీల సరసన నిలపాలని ఇటీవల తనతో చెప్పారని వెల్లడించారు. త్వరలో జరగనున్న ఏయూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఒక ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. విలేకరుల సమావేశంలో ఏయూ అలూమ్ని అసోసియేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కుమార్‌రాజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్షిక సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఒకటో తేదీన సీఎం ట్రాన్సిట్ హాల్టు

విశాఖపట్నం, అక్టోబరు 29: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే నెల ఒకటో తేదీ శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు విశాఖ విమానాశ్రయంలో ఆగనున్నారు. శుక్రవారం సీఎం ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖపట్నం చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లాకు వెళతారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, విజయవాడ వెళతారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

క్రైం... crime news

ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి

డుంబ్రిగుడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రాయి పెద అంజోడ గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందినట్టు స్థానిక ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. వివరాలివి.. పెద అంజోడకు చెందిన పాంగి ప్రసాదరావు (26) అనే గిరిజనుడు మంగళవారం ఉదయం ట్రాక్టరుతో పొలం పనులకు వెళ్లారు. దుక్కి చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో గాయపడిన ప్రసాదరావును కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతదేహానికి అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

428 కిలోల గంజాయి పట్టివేత

- రెండు లీటర్లు లిక్విడ్ గంజాయి కూడా.. ఏడుగురి అరెస్టు
- ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడి

అనకాపల్లి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వి.మాడుగుల, కొత్తకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం 428 కిలోల గంజాయి పట్టుకుని, ఏడుగురిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వి.మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ గరికబంధ శివారులో బొలేరో వాహనం నుంచి లారీలోకి గంజాయి ప్యాకెట్లను లోడింగ్ చేస్తున్నట్టు కె.కోటపాడు సీఐ పైడపునాయుడుకు సమాచారం అందిందని తెలిపారు. దీంతో వెంటనే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి గంజాయిని స్వాధీనం చేసుకున్నారని, ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. మొత్తం 408 కిలోల ఎండు గంజాయితోపాటు రెండు లీటర్ల లిక్విడ్ గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, బొలేరో వ్యాన్, లారీ, ద్విచక్ర వాహనంతోపాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. అదే విధంగా రావికమతం మండలం కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి దొండపూడి చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తూ, ఒక కారును ఆపారని, అందులో ప్రయాణిస్తున్న కేరళ రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారని ఆయన తెలిపారు. కారును తనిఖీ చేయగా డిక్కీలో 40 కిలోల గంజాయి పట్టిబడిందన్నారు. నిందితులను అరెస్టు చేసి ఐదు మొబైల్ ఫోన్లు, రూ.8 వేల నగదుతోపాటు కారును సీజ్ చేశామని చెప్పారు. భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుని, ఏడుగురు నిందితులను అరెస్టు చేసిన వి.మాడుగుల, కె.కోటపాడు, కొత్తకోట పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందిని అభినందించారు. ప్రశంసాపత్రాలతోపాటు నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ అప్పారావు, రోలుగుంట ఎస్ఐ రామకృష్ణ, రావికమతం ఎస్ఐ రఘువర్మ, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు మండలంలో 130 కిలోలు..

పెదబయలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కారులో తరలిస్తున్న 130 కిలోల గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ కె.రమణ తెలిపారు. దీనికి సంబంధించి మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సోమవారం ముందస్తు సమాచారం మేరకు అడుగులపుట్టు పంచాయతీ కొత్తపుట్టు కూడలి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కుజబంగి వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా, అందులో మూడు బస్తాల్లో 130 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ చిట్టివలసకు చెందిన కొర్ర నాగేశ్వరరావు, కిల్లో ప్రభాస్, ముంచంగిపుట్టు మండలం సుజనకోటకు చెందిన పాంగి శాంతిని అదుపులోకి తీసుకున్నారు. కారును సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

దేవరాపల్లి మండలంలో మూడు కిలోలు..

దేవరాపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద మూడు కిలోల గంజాయితో ఇద్దరు యువకులను అరెస్టు చేశామని ఎస్ఐ టి.మల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. విశాఖపట్నానికి చెందిన తొట్ల శశికుమార్, వంగలపూడి తనూజ్ ద్విచక్ర వాహనంపై గంజాయి తెస్తున్నారని, శ్రీరాంపురం వై.జంక్షన్ చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నర్సీపట్నంలో 16 కిలోలు..

నర్సీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసులు 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, తమిళనాడుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముందుగా అందిన సమాచారంతో పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు సిబ్బందితో కలిసి మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గంజాయిని తరలించడానికి సిద్ధంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని నల్లమన్నారు కొట్టాయి గ్రామానికి చెందిన సతీశ్, సేలం జిల్లా వేలేన్యూ స్ట్రీట్ లైన్మేడుకి చెందిన జ్ఞానశేఖరన్ రాజాలను అరెస్టు చేసి వారి నుంచి రెండు బ్యాగులలో ఉన్న 16 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. .

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం సమీపంలో మంగళవారం ఉదయం స్కూల్ విద్యార్థులను తీసుకు వస్తున్న ఓ మినీ వ్యాన్‌ను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న షేక్ బషీర్ అనే యువకుడితో పాటు వెనుక కూర్చున్న మరో యువకుడికి గాయాలయ్యాయి.

టెన్త్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు

సబ్బవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధి నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ బాలిక అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాల ప్రకారం.. గంగవరం గ్రామానికి చెందిన మాటూరి రామారావు కుమార్తె రూప, నంగినారపాడు హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్నది. రోజూ మాదిరిగానే ఈ నెల 19వ తేదీ ఉదయం పాఠశాలకు వెళ్లిన బాలిక, సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో గాలింపు చర్యలు చేపట్టి, బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో 21వ తేదీన బాలిక తండ్రి రామారావు పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా గాలింపు చర్యలు చేపట్టినా అచూకీ లేకపోవడంతో మంగళవారం కేసు నమోదు చేశారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 7వ పేజీ తరువాయి

చీడికాడ, దేవరాపల్లి మండలాలు వున్నాయి. ఏవోబీలో సాగు చేస్తున్న గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా అనకాపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చేరుస్తు న్నారు. ఇక్కడి నుంచి రాష్ట్రంతోపాటు దేశంలోని పలుచోట్లకు గంజాయిని రవాణాచేస్తున్నారు. ఇందుకోసం కొంతమందిని కొరియర్లుగా నియమించు కున్నారు. వీరు బ్యాక్‌ప్యాక్ బ్యాగులు, చేతి సంచుల్లో ఐదు నుంచి పది కేజీల వరకు గంజాయిని ప్యాకింగ్ చేసుకుని సాధారణ ప్రయాణికుల మాదిరిగా బస్సులు, రైళ్లల్లో విజయవాడ, హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు చేరుస్తున్నారు. మరికొందరు స్మగ్లర్లు వ్యాన్లు, లారీలు, ట్రక్కులు, ఆయిల్ ట్యాంకర్లలో ప్రత్యేకంగా అరలు ఏర్పాటుచేయించి, పెద్ద మొత్తంలో గంజాయిని జాతీయ రహదారి మీదగా దర్జాగా జిల్లాలను దాటిస్తున్నారు. దీంతో పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు నిఘాను మరింత పెంచారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు సరిహద్దులో వున్న మండలాల్లో కొత్తగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

పది నెలల్లో 5,519 కిలోల గంజాయి పట్టివేత

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు పోలీసుల టాస్క్‌ఫోర్స్ బృందాలు, చెక్‌గేట్‌ల వద్ద నిర్వహించిన తనిఖీల్లో 5,519 కిలోల గంజాయిని పట్టుకున్నారు. గంజాయి స్మగ్లర్లు ఏజెన్సీలో సాగుదారుల నుంచి కిలో రూ.5 వేలకు కొనుగోలు చేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఈ ప్రకారం పట్టుబడిన గంజాయి విలువ రూ.2.76 కోట్లు వుంటుందని అంచనా. పట్టుకున్న గంజాయికి సంబంధించి 388 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 108 మందిని మాత్రమే పోలీసులు అరెస్టు చేశారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా: ఎస్పీ

గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నది. అనకాపల్లి జిల్లా మీదుగా గంజాయి రవాణా జరిగే మార్గాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతున్నది. స్టాటిక్ చెక్‌పోస్టు, డైనమిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయిస్తున్నాం.

వైసీపీ ప్రభుత్వంలో వేధింపులు, బెదిరింపులు

... 7వ పేజీ తరువాయి

హామీ ఇచ్చారు. లీజుల్లో అడ్డంకులు తొలగిస్తామని, వ్యాపారులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ క్వారీ యజమానులు నిజాయితీగా వ్యవహరించాలని, గత ప్రభుత్వంలో ఏర్పడిన ఇబ్బందులు కూటమి ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. సమావేశంలో పెందుర్తి, విశాఖ దక్షిణ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నేత దాడి రత్నాకర్ మాట్లాడారు. గనుల శాఖ ఏడీ జగన్నాథరావు స్వాగతం పలకగా, మంత్రికి పలువురు క్వారీ యజమానులు వినతిపత్రాలు అందజేశారు.

వైసీపీ పాలనలో కార్మిక శాఖ నిర్వీర్యం

... 7వ పేజీ తరువాయి

చెప్పారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ, ఏడాది క్రితం ఈ ఆస్పత్రిని నిర్మించి ఉంటే ఎసెన్షియా కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారిలో కొంత మందినైనా బతికించుకునే వాళ్లమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమల కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.